తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## లడ్డు పోటులో ఛైర్మన్, ఈఓల ఆకస్మిక తనిఖీలు



కాణిపాకం, జనవరి 4 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం లడ్డుపోటులో ఆదివారం ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్‌లు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.వారు లడ్డు తయారీ విధానాన్ని పరిశీలించారు.లడ్డు తయారీలో భాగంగా బూంది తయారీ విధానాన్ని పరిశీలించారు. అలాగే లడ్డు తయారీలో దిట్టం గురించి అడిగి తెలుసుకున్నారు.లడ్డు రుచిని మరింతగా పెంచడానికి లడ్డూ తయారీలో కొత్త విధానాన్ని తీసుకురావడానికి దగ్గరుండి లడ్డూ తయారీ నిర్వహించారు.అలాగే లడ్డూలను నాణ్యతగా, రుచిగా తయారు చేయాలని లడ్డూ తయారీ కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈకార్యక్రమంలో పోటు ఇన్‌చార్జి సంతానం తదితరులు పాల్గొన్నారు.

### సత్యవేడులో

## రేషన్ మాఫియా..

### న డీలర్ల హవా.. బియ్యం బదులు నగదు పంపిణీ...

సత్యవేడు, జనవరి 4 ప్రభాతవార్త:

సత్యవేడులో రేషన్ బియ్యం దందా సర్వ సాధారణంగా మారిపోయింది. రేషన్ బియ్యం అక్రమ రవాణా డీలర్లే కొనసాగుతున్నట్లు లబ్ధిదారులు గగోలు పెడుతున్నారు. అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. నిరుపేదలు ఆకలితో అలమటించకూడదన్న ఉద్దేశంతో నాడు దివంగత నేత, టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు రేషన్ బియ్యం పథకానికి శ్రీకారం చెప్పిన విషయం అందరికి తెలిసిందే. అయితే పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం పక్కదారి మల్లుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే మండల కేంద్రమైన సత్యవేడులో పౌర సరఫరా శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న గోడౌన్ నుంచి ఆయా రేషన్ షాపులకు రేషన్ బియ్యం సరఫరా అవుతుంది. అయితే దీన్ని ఆశరా చేసుకుని కొందరు బియ్యం స్మగ్లర్సు రేషన్ బియ్యాన్ని సేకరించే పనిలో పడడం షరా మాములుగా మారుతుంది. దీంతో పాటు కొందరు మహిళలు కూడా గ్రామాల వైపు పరుగులు తీసి రేషన్ బియ్యాన్ని సేకరించి స్థానికంగా ఉన్న స్మగ్లర్లకు విక్రయిస్తున్నట్లు సమాచారం. పెద్ద ఎత్తున సహకరిస్తున్న రేషన్ బియ్యాన్ని మూడో కంటికి తెలియకుండా నిల్వ కేంద్రాల్లో దాచి ఉంచి మూడు రోజులకు ఒక సారి ఆటోలు, మినీ వ్యాన్‌లు, వాహనాల ద్వారా అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కిలో బియ్యాన్ని 4,5 రూపాయలకు కొనుగోలు చేసి స్మగ్లర్లకు కిలో 8 రూపాయలకు విక్రయించున్నట్లు తెలిసింది. ఇలా సేకరించి బియ్యం రహస్య ప్రాంతాల్లో నిల్వచేసిన బియ్యాన్ని స్మగ్లర్సు రాత్రి వేళలో మూడో కండి తెలియకుండా సూళ్లూరుపేట, బెంగళూరు వాటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక్క సత్యవేడు పట్టణంలోని ఇద్దరు, ముగ్గురు స్మగ్లర్ల కనుసనల్లో రేషన్ బియ్యం దందా కొనసాగుతున్నట్లు ఆరోపణ వినిపిస్తున్నాయి. దీంతో పాటు సత్యవేడు, అంబాకం, శ్రీసిటీ వంటి ప్రాంతాల్లో కూడా అక్కడ స్థానిక ప్రజాప్రతినిధి కనుసనల్లో సేకరిస్తున్న రేషన్ బియ్యాన్ని మామిడి తోపులో దాచి ఉంచి ఆటోల ద్వారా నాగలాపురం తరలిస్తున్నారు. ముఖ్యంగా రేషన్ బియ్యం, ఎక్కడకక్కడ సేకరిస్తూ అక్రమంగా తరలిస్తున్న సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహారించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రేషన్ దందాను అరికట్టడానికి రేషన్ దుకాణాల్లో ఈ పాస్, బయోమెట్రిక్ విధానం అమల్లోకి వచ్చిన ఫలితం లేకుండా పోతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రేషన్ దందాను అరికట్టాల్సిన సంబంధిత అధికారులు మొక్కుబడి దాడులు చేస్తున్నారే తప్ప నిర్దిష్టమైన చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఏమైనప్పటికీ రేషన్ బియ్యం అక్రమ దందాను మండల అధికారులు కట్టడి చేయడంలో విఫలమవుతున్నారనే ఆరోపణల్లో నిజం లేకపోలేదు. ఇప్పటికైనా దీనిపై సంబంధిత అధికారులు స్పందించి రేషన్ బియ్యం దందాను అరికట్టడానికి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# రాయుడి హత్యకేసులో రోజుకో మలుపు!

### జనాల్లో గందరగోళం - బాధితుడు చంద్రబాబు కోట విడుదల చేసిన వీడియో

శ్రీకాళహస్తి,జనవరి 4 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వినూత కోట డ్రైవర్‌గా పని చేస్తున్న రాయుడు హత్యకేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ఆదివారం వినూత కోట భ ర్త చంద్రబాబుకోట ఓ వీడియోను విడుదల చేసారు.ఈ కేసు రోజుకో ట్విస్టు చోటు చేసుకుంటుంది. ఆదివారం విడుదలైన వీడియోలో ఈ కేసుకు సంబంధించి పోలీసులు సమాచారం విడుదల చేయటానికి ముందు స్థానిక శాసనసభ్యుడు ఎందుకు మీడియా సమావేశం ఏర్పాటు చేసినట్లు? మృతి చెందిన రాయుడు తన సొదర సమానుడనటం? అంత్యక్రియలకు తానే సొమ్ములు ఇస్తామనటం? అలాగే అంత్యక్రియలకు హాజరౌతామని చెప్పటంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు.ఆయనకు మా పార్టీకి చెందిన రాయుడుకు ఉన్న సంబంధం ఏమిటి? అనేది ప్రశ్నార్థకంగా ఉందన్నారు.చెన్నైలో తమపై పెట్టిన కేసులకు సంబంధించి కొన్ని విషయాలను కోర్టులో కేసు ఉన్నందువల్ల కొన్ని అంశాలు మాత్రమే వివరిస్తున్నట్లు వివరించారు.ఈ కేసుకు సంబంధించి ఆయన మాట్లాడుతూ చెన్నై పోలీసులకు సంబంధించిన కేసులో తాము రిమాండ్‌కు పంపక ముందే శాసనసభ్యుడు ఎందుకు అత్యూత్సాహం ప్రదర్శించినట్లు? అని ప్రశ్నించారు. చెన్నై పోలీసు కమిషనర్ ఓ నిర్ణయానికి రాకముందే శాసనసభ్యుడు ఎందుకు? స్పందించినట్లు అని ప్రశ్నించారు.ఈ కేసులో తమను అనవసరంగా ఇరికించారని ఆరోపించారు. ఒక విషయం అలోచించాలి అంధ్రాలో హత్య చేసి 150 కిలోమీటర్ల దూరంలో తీసుకెళ్ళి వేయటం అనేది సాధ్యమా? చుట్టూ పోలీసు స్టేషన్, హైకోర్టులున్నాయి. అంతేకాక పదుల సంఖ్యలో సిసి కెమెరాలు ఉన్న చోట ఎందుకు వేస్తాము? జూన్ 25న తన మామకు ప్రమాదం జరిగింది. ఆయనకు చెన్నైలోని అపోలో చేర్చి వైద్యం జరిపించినట్లు వివరించారు.వారం రోజులు అక్కడున్నాము. తరువాత వైద్య పరీక్షలకు తరచూ చెన్నై వెళుతున్నాము.జూలై 7వ తేది అపోలోకు తీసుకెళ్ళినట్లు రికార్డులు చూపారు.ఎవరైనా అపోలో అసుపత్రిలో పరశీలించుకోవచ్చు. ఈ కేసుకు సంబంధించి పెద్ద కుట్రకోణం ఉంది. ఓ మహిళ నాయకురాలి భవిష్యత్తును నాశనం చేయటానికి రాజకీయ భవిష్యత్తును తుదముట్టించుటకు పన్నిన పన్నాగం అన్నారు.ప్రజల కోసం పోరాటం చేస్తున్న తమపై ఓర్వలేక రాజకీయంగా సమాధి చేయటానికే లేని పోని హత్య కేసులను బనాయించారు.పోలీసులు కేసులో సరైన సమాచారం ఇవ్వలేకను తమకు బెయిల్ వచ్చిందన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు కోట

#### ప్రభుత్వం ఎందుకు స్పందించదు? నిర్ధోషులమని నిరూపించుకుంటాము.!

రాష్ట్రంలోని ఓ శాసనసభ్యునిపై ఆరోపణలు వచ్చినపుడు ప్రభుత్వం ఎందుకు స్పందించదు? ఓ మహిళకు సంబంధించి ఇంత దారుణంగా ప్రణాళిక రూపొందించి అమలు చేసిన నాయకునిపై ఎందుకు ప్రభుత్వం స్పందించదు? కనీసం పిలిపించి విచారించలేదు? నాడు తాము మెజిస్ట్రేట్ ముందే హత్యకు సంబంధించి సంబంధం లేదని చెప్పామన్నారు.తమను ఆ రోజు రాత్రి 10గంటలకు రిమాండ్‌కు పంపితే సాయంత్రమే ఎంఎల్ఏ ఎందుకు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ కేసుకు సంబంధించి శ్రీకాళహస్తిలోని వన్‌టౌన్ ఇన్సెపెక్టర్ గోపి ఎందుకు తమిళనాడు పోలీసు కమిషనర్‌తో చర్చించారు. కేసును ఆంధ్రాకు మార్చుకొని తమను ఆర్నెల్ల పాటు జైలులో పెట్టడానికే కుట్రలు జరిగాయన్నారు.ఇది ఒక వినూత కోటకు జరిగిన అన్యాయంకాదు. ఇలా అయితే రాజకీయంలో మహిళలు ఎలా రాజకీయాల్లో రాణిస్తారు?అని ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం ఎందుకు స్పందించదు? ఓ కమిటి వేసి నిజానిజాలు తేల్చరు? అని ప్రశ్నించారు. తమిళనాడు పోలీసులు దీప్‌గా విచారణ జరుపుతున్నారు.? నిజానిజాలు తేలుతాయన్నారు.

## రథసప్తమికి మొదలైన విస్తృత ఏర్పాట్లు



ప్రభాతవార్తప్రతినిధి–తిరుమల:

ఏడుకొండలు త్వరలో మరో విశిష్టపండుగకు సిద్ధమవుతోంది. ఈనెల 25వతేదీ ఆదివారం సూర్యజయంతి రథసప్తమి వేడుకలు జరగనున్నాయి. ఆ రోజు ఉదయం 5.30గంటల నుండి రాత్రి 9గంటల వరకు ఒకేరోజు ఏడువాహనాలపై మలయప్పస్వామి ఆలయ మాఢవీధుల్లో ఊరేగనున్నారు. ఇందుకోసం అన్ని రకాల ఏర్పాట్లు, భక్తులకు సేవలందించేందుకు సిద్ధమవుతున్నారు. ఆలయ మాఢవీధుల్లో గ్యాలరీలు ఏర్పాటు పనులు మొదలవుతూన్నాయి. భక్తులకు సౌకర్యాలు, భద్రత అంశాలపై ,సేవలపై టిటిడి అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. ఆలయం ముందు, మాఢవీధుల్లో గ్యాలరీలు, జర్మన్‌షెడ్లను ఏర్పాటుచేసేందుకు సామాగ్రిని దించారు. భక్తులకు చలికి, ఎండకు ఇబ్బందులు కలగకుండా మాఢవీధుల్లో అవసరమైన ప్రాంతాల్లో అదనపు ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

## ప్రజా సమస్యలపై 'వార్త' ప్రత్యేక చొరవ

### - ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

### - ఘనంగా చిత్తూరు జిల్లా నూతన కేలండర్ ఆవిష్కరణ !!



కుప్పం, జనవరి 4 ప్రభాతవార్త

ప్రజల సమస్యలపై 'వార్త' దినపత్రిక చూపే చొరవ అభినందనీయమని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం కుప్పంలోని క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ 'వార్త ' దినపత్రిక చిత్తూరు జిల్లా నూతన సంవత ్సర కేలండర్‌ను లాంఛనంగా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పత్రికా రంగంలో 'వార్త' దినపత్రిక ముప్పై ఏళ్ల ప్రస్థానంకు చేరుకోవడం హర్ ్షణీయమన్నారు. 1996నుంచి నేటివరకు వార్త ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ పత్రికా రంగంలో తనదైన శైలిలో ముందుకు సాగుతుండడం జరుగుతోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి ప్రజల దరి చేరడంలో పత్రికలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. 'వార్త' నూతన సంవత్సర కేలండర్ తన చేతుల మీదుగా ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బాబునాయుడు, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కాశీనాథ్, మాజీ సర్పంచ్ చం ద్ర, వార్త సీనియర్ పాత్రికేయులు కెవెన్ ప్రసాద్ (శాంతిపురం), వార్త కుప్పం స్టాఫ్ రిపోర్టర్,ఇన్‌చార్జ్ అస్గర్, గుడుపల్లె రిపోర్టర్ బేటప్ప, రామకుప్పం రిపోర్టర్ శ్రీనివాసులురెడ్డి, వి.కోట రిపోర్టర్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

### బలిజపల్లి గ్రామస్థుల

## ఆప్యాయత మరువలేనిది

### మెగాస్టార్ చిరంజీవి కుమార్తె సుష్మిత



రామచంద్రాపురం, జనవరి 4 ప్రభాతవార్త:

బలిజపల్లి గ్రామస్థుల ఆప్యాయత, అనురాగాలు మరువలేనివని మెగాస్టార్ చిరంజీవి కుమార్తె, ప్రొడ్యూసర్ సుష్మిత అన్నారు. తిరుపతి జిల్లా, రామచంద్రాపురం మండలం, బలిజపల్లి గ్రామంలో ఆదివారం "మన శంకర్ వరప్రసాద్ గారు" మెగా చిత్రం ఈ నెల 12న విడుదల నేపథ్యంలో డైరెక్టర్ అనిల్ రావిపూడి, ప్రొడ్యూసర్ గారపాటి సాహుతో కలసి బలిజపల్లిలోని చిరంజీవి వీరాభిమానులు పొర్లుదండాల ఈశ్వర్ రాయల్, చంద్రశేఖర్ రాయల్ నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా తమ అభిమాన హీరో మెగాస్టార్ కుమార్తె సుష్మిత, స్టార్ డైరెక్టర్ అనిల్ రావిపూడి తమ గ్రామానికి వస్తున్నారనే ఆనందోత్సాహాలతో గ్రామస్థులు వారికి మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భాణాసంఛా పేళుళ్ళ నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. గ్రామమంతా హరిదాసు భజనలు, గంగిరెద్దుల ఆటలు, చెక్కల భజనలు, రంగు రంగుల రంగవళ్ళులతో ముందుగానే గ్రామంలోకి సంక్రాంతి శోభను తీసుకువచ్చారు. గ్రామ దేవతలు నడివీధి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, రామాలయానికి చేరుకున్న వీరికి అర్చకులు వేదమంత్రోచ్చారణలతో ఆశీస్సులందించారు. జల్లికట్టు సంబరాల కొరకు సిద్ధం చేసిన బసవన్నలను తిలకించి హర్షం వ్యక్తం చేస్తూ గ్రామస్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తపసి మురళి రెడ్డి, దండు లక్ష్మీపతి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అభినవ భగీరథుడు సిఎం చంద్రబాబు

### ప్రభుత్వ విప్ డా॥ కంచర్లశ్రీకాంత్

### -ఘనంగా కృష్ణాజలాలకు జలహారతి.. వైభవంగా తెప్పోత్సవం !!



కుప్పం, జనవరి 4 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలో కరువు తొలగేలా కృష్ణాజలాలు తెచ్చిన అభినవ భగీరథుడు సిఎం చంద్రబాబు నాయుడు అని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆదివారం గుడుపల్లె మండలం పాపానూరు చెరువు కృష్ణాజలాలతో నిండి ప్రవహిస్తుండడంతో కృష్ణాజలాలకు ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్,పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌లు జలహారతి కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డా॥ శ్రీకాంత్ మాట్లాడుతూ దాదాపు 750కి.మీ.ల దూరంలో ఉన్న శ్రీశైలం నుంచి ఎగువన ఉన్న కుప్పం ప్రాంతానికి హంద్రీ-నీవా కాలువల ద్వారా కృష్ణాజలాలు రావడం ఓ చరిత్ర అన్నారు. గత పాలకులు ఎన్నికల వేళ స్టంట్ వేసి కుప్పానికి నీళ్లు తెచ్చామని ప్రజలను మోసగించారన్నారు. అయితే సిఎం చంద్రబాబునాయుడు కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు సుమారు 4వేల కోట్లు వ్యయం చేసి కాలువ పనులు పూర్తి చేయించి ఇచ్చిన మాట ప్రకారం కుప్పం చివరి పాయింట్ పరమసముద్రందాకా నీరు తెచ్చి చరిత్ర సృష్టించారన్నారు. కుప్పంలోని అన్నిచెరువులు కృష్ణాజలాలతో నిండుతున్నాయన్నారు. రైతుల కంట ఆనందం చూడాలనేదే సిఎం ఆశయమన్నారు. అనంతరం తెప్పోత్సవం కార్యక్రమంను చేపట్టారు. అంతకుముందు డా॥ శ్రీకాంత్ గంగమ్మకు చీర,సారె, పసుపు,కుంకుమలు సమర్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం, కార్పోరేషన్ డైరెక్టర్ బాబు, సర్పంచ్ ఎల్లప్ప, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## వినోదభరితంగా శృంగారరాయుని ప్రణయకలహోత్సవం



తిరుమల,జనవరి 4ప్రభాతవార్తప్రతినిధి:

ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం తరువాత ఐదవరోజు ఆదివారం తిరుమలలో కలహ శృంగార భరితమైన ప్రణయ కలహోత్సవం వేడుకగా జరిపించారు. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి ఊరేగింపుగా ఆలయం మాఢవీధుల్లో ఉత్తరమాఢవీధికి చేరుకున్నారు. అక్కడ వరాహస్వామి ఆలయం సమీపంలో అమ్మవార్లు, స్వామివారు ఎదురేగారు. ఆలయ అర్చకులు,పరిచారకులు స్వామిఅమ్మవార్ల తరపున పూలబంతులను విసిరేసుకుంటూ స్వామివారిని నిందాస్తుతి చేసి పాశురాలను పారాయణం చేశారు. అమ్మవార్ల నుండి తప్పించుకుని ఆలయంలోనికి ఒకే పల్లకిలో వేంచేపు చేశారు .



రాజగోపురంపై ఉదయిస్తున్నట్టు కనబడుతున్న రెడ్‌మూన్

## చలని రేయి రెడ్ మూన్ కనువిందు

ఓ వైపు పొగమంచు. జనంచలికి వణుకుతున్న తరుణంలో చల్లని రేడు ఎర్రటి రూపంలో కనువిందు చేసాడు. ఎటు నుంచి చూస్తే అటు వైపు అన్నట్లు కన్నుల పండువగా మారింది. భక్తకన్నప్ప కొండపై వెలసిన పార్వతీ పరమేశ్వరుల కనుసన్నల్లో ఉన్నట్లు, రాజగోపురం పైన ఉదయిస్తున్నట్లు చూపరులను ఇట్టే ఆకట్టుకున్నాడు.

ప్రభాతవార్త - శ్రీకాళహస్తి,

# మండలాధికారి మాయాజాలం!

### డికెటి భూముల రిజిస్ట్రేషన్!!



శ్రీకాళహస్తి,జనవరి 4 ప్రభాతవార్త

ఏర్పేడు మండలంలో డికెటిభూముల నమూనాలను మార్చేసే రెవెన్యూ అధికారులున్నారని అయితే వాటిని చక్కగా రిజిస్ట్రేషన్ చేసే తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ అఫీసర్ తీరుతో అంతా గందరగోళంగా మారిందనే విమర్శలు వెలువెత్తుతున్నాయి.రెవెన్యూ అధికారులు అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తుతూ తమ పబ్బం గడుపుకుంటున్నట్లు విమర్శలు బాహాటంగా ఉన్నాయి.ఈ నేపథ్యంలో నేడు టిసిఎల్ కంపెనీకి సమీపంలో సాగుతున్న లేఅవుట్ వివాదాలకు వేదికగా మారింది.ఈ నేపథ్యంలో మర్రిమంద గ్రామంలో దళిత సామాజిక వర్గానికి చెందిన పాడేటి చెంగర్‌రాయులుకు సర్వే నెంబర్444/1లో 1.5సెంట్లు ఖాతా నెంబర్ 1774 కలిగిన డికెటి నెంబర్ 25/4/25 భూమి ఉంది. అలాగే పాడేటి కుమారస్వామికి 444/2లో 1.30 ఎకరాలు ఖాతా నెంబర్ 1775 డికెటి నెంబర్ 25/4/1410,పాడేటి బాలకృష్ణకు సర్వే నెంబర్ 444/3లో 1.30 ఎకరాల భూమి ఖాతా నెంబర్ 1775 కలిగిన డికెటి 26/14/10 భూములున్నాయి.ఈ భూములను 2006 డిసెంబర్ 9న 4.10ఎకరాల భూమికి డికెటి పట్టాలు మంజూరు చేసారు. అయితే పట్టాలు జారి చేసినపుడు అమ్మకూడదు కొనకూడదని చట్టం ఉంది.ఈ భూమి 22 ఏలో లేకపోయినప్పటికి రాష్ట్ర ప్రభుత్వం డికెటి భూములు అన్లైలో రిజిస్ట్రేషన్ నిలుపుదల చేసి ఉన్న సమయంలో 2024 డిసెంబర్ 18న తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎకరా రూ.34లక్షల 32వేల చొప్పున 4 ఎకరాల 10 సెంట్ల భూమిని గోవిందవరం గ్రామానికి చెందిన ఓ నాయకుడికి శ్రీకాళహస్తి మండలంలోని కుంటిపూడికి చెందిన మరొకరికి రిజిస్ట్రేషన్ చేయటం గమనించదగ్గ విషయం. ఈభూమిని కొనుగోలు చేసినవారు తిరుపతికి చెందిన వారికి రూ.ఐదుకోట్లుకు అమ్మటం జరిగింది.ఈ భూములను కొనుగోలు చేసిన తిరుపతి వాసులు పక్కనే ఉన్నచెరువుకట్టను చదును చేస్తుండటంతో గ్రామస్థులు కొందరు అ భ్యంతరం చెప్పటంతో తాము కొనుగోలు చేసామని చెప్పటం గమనించ దగ్గ విషయం అన్నారు. అర్హత లేని డికేటి భూములను 22ఏ నుంచి తొలగించి అన్‌లైన్లో ఎక్కించి రిజిస్టర్ చేయించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించనున్నట్లు సమాచారం.

## రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం



తవణంపల్లె,, జనవరి 4 ప్రభాతవార్త: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ సప్తగిరి ప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని జొన్నగురకల సచివాయంలో మత్యం రెవెన్యూ గ్రామ పరిధిలోని రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా సప్తగిరి ప్రసాద్ మాట్లాడుతూ రైతుల భూములకు సంభందించి గత ప్రభుత్వం అప్పటి సీఎం జగన్ ఫోటోతో కూడిని పాసు పుస్తకాలను పంపిణీ చేశారని ధ్వజమెత్తారు. అయితే ఎన్నికల హామీలో భాగంగా ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు రాజముద్రతో కూడిన పాసుపుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మత్యం రెవెన్యూ గ్రామ పరిధిలో 440 మంది రైతులకు రాజముద్రతో కూడిన పాసుపుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక విఆర్ఓ ప్రకాష్, టీడీపీ నాయకులు బాబునాయుడు, జయపాల్‌తో పాటు మణియాదవ్, శ్రీనివాసులు యాదవ్, సుబ్బారెడ్డి, బాలచంద్రయాదవ్, మదన్‌మోహన్‌రెడ్డి, మధు, రఘుపతిలతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఆలయంలో చోరీ చేయబోయి పట్టుబడిన దొంగలు

పాకాల, జనవరి 4, ప్రభాతవార్త: తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం కోనపరెడ్డిపల్లి గ్రామం రామాలయం గుడిలో శనివారం రాత్రి ఒక గంట ప్రాంతంలో చోరీ చేయబోయి గ్రామస్తులకు దొంగలు పట్టు పడ్డారు. గత కొంతకాలంగా పాకాల మండలంలో పలుచోట్ల దొంగతనాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న దొంగల ముఠా కోనపరెడ్డిపల్లి గ్రామస్తులకు పట్టు పడ్డారు. దొంగలను పాకాల పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇచ్చి అప్పగించారు. పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గురవారెడ్డికి సన్మానం



పూతలపట్టు, జనవరి 4, ప్రభాతవార్త ఉమ్మడి జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ రెడ్డి వారి గురువా రెడ్డి వారి స్వగ్రామమైన బండారిపల్లిలో 31/2017 జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి వారిని ఘనంగా సత్కరించారు. జిల్లా గ్రంథాల సంస్థ ఉద్యోగ సంఘ నాయకులు వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి చేతుల మీదుగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రెడ్డివారి గురువారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల్లో ఉన్నటువంటి గ్రంథాలయాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అహర్నిశలు తన వంతు కృషి చేస్తానని ఉద్యోగులకు హామీ ఇచ్చారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో గ్రంథాలయ ఉద్యోగ సంఘ నాయకులు జై. శివప్రసాద్, టి. రవీంద్ర బాబు, ఎం. తులసి నాయక్, బి.చంద్రశేఖర్ నాయక్, బి. నాగరాణి, ఏ.రెడ్డమ్మ, టి రాజు, రెడ్డి కుమారి పి. ప్రమీల ఎస్. జిల్లానిభాష నాగలాపురం ప్రసాద్ టి.జీవన్, పి. విశ్వప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## రాయలవారి జయంతిని ఘనంగా నిర్వహించాలి



కుప్పం, జనవరి 4 ప్రభాతవార్త : విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయల జయంతిని ఈనెల 17న కుప్పంలో ఘనంగా నిర్వహించాలని నియోజకవర్గ బలిజ సంఘ నేతలు తీర్మానించారు. ఆదివారం స్థానిక శ్రీ సుజ్ఞానంద ఆ శ్రమంలో బలిజకులస్తుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘ అధ్యక్షుడు గోపీనాథ్ మాటాడుతూ కుప్పంలో చేపట్టే కార్యక్రమంను నియోజకవర్గంలోని బలిజ కులస్తులు అందరూ జయప్రదం చేయాలని కోరారు. ఆరోజు చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. త్వరలో ప్రతి ఇంటికి వెళ్లి కార్యక్రమంకు ఆహ్వానించడం జరుగుతుందన్నారు. అనంతరం ఇటీవల డాక్టరేట్ పొందిన గోపీనాథ్‌ను సంఘ నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ నేతలు ప్రభాకర్, మంజు, ఆర్ఆర్ రవి, సత్యేంద్రశేఖర్, డీలర్ వెంకటేష్, చలపతి, మణి, సోమశేఖర్, కృష్ణన్, లోకేష్, భాగ్యలక్ష్మి త్రిలోక్, అనసూయ, గాయత్రి పాల్గొన్నారు.

## ఓపక్క సాఫ్ట్‌వేర్ ఉద్యోగం..మరో పక్క ప్రకృతి వ్యవసాయం



కుప్పం, జనవరి 4 ప్రభాతవార్త : ఉన్నత చదువులు చదివిన ఓ యువకుడు ఓ పక్క సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ మరో పక్క తన స్వగ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. మండలంలోని పైపాళ్యం పంచాయతీ తంగేడికుప్పంకు చెందిన సందీప్ కుమార్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అయితే అతను అంతటిలో సరిపెట్టుకోక తన సొంత గ్రామంలో మట్టితల్లిపై మమకారాన్ని పెంచుకున్నాడు. తమకు ఉన్న పొలంలో వ్యవసాయ క్షేత్రంగా మార్చి అక్కడ ప్రకృతి వ్యవసాయాన్ని చేయిస్తున్నాడు. ఆదివారం ఈవ్యవసాయ క్షేత్రాన్ని మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, కార్పోరేషన్‌డైరెక్టర్ చెక్కునత్తం మణి, సర్పంచ్ సంతోష్ పరిశీలించారు. కార్యక్రమంలో నేతలు గిరిధర్, భరణి, బీరప్ప, వినోద్ పాల్గొన్నారు.

## ధ్యానాభిరామి స్వామి గుడిలో హిందూ సమ్మేళనం



బైరెడ్డిపల్లి జనవరి 4 ప్రభాతవార్త: బైరెడ్డిపల్లి మండలం దాసర్లపల్లి ధ్యానాభిరామ స్వామి గుడి కొండపైన హిందూ సమ్మేళనం ఘనంగా జరిగినది. ఈ సందర్భంగా హిందువులు సమ్మేళనంలో పాల్గొని ప్రసంగించడం జరిగినది. ఈ కార్యక్రమంలో వక్తలు ప్రసంగిస్తూ కులం అనేది ఇంటి లోపల వరకేనని ఇంటి బయటకు వస్తే అందరూ హిందువుల మేనని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కులమతాలకు అతీతంగా, రాజకీయ పార్టీలకు అతీతంగా పెద్ద సంఖ్యలో హిందువులు కార్యక్రమాన్ని జరుపుకోవడం జరిగినది. అనంతరం పిల్లలచే శ్రీ సీతారాముల వారి పాటలకు నృత్యం చేయడం జరిగినది.

## ఘనంగా జనసేన పార్టీ పతాకావిష్కరణ



గుడుపల్లె, జనవరి 4 ప్రభాతవార్త మండలంలోని ఓఎన్ కొత్తూరు గ్రామంలో ఆదివారం కుప్పం జనసేన ఇన్‌చార్జ్, కాణిపాకం బోర్డు సభ్యుడు నరేష్ జనసేన పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు నాయకత్వాన్ని బలపరుస్తూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా జనసేన పార్టీ పనిచేస్తుందన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కుప్పంలో జనసేన పార్టీని గ్రామస్థాయిలోబలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో గుడుపల్లె మండల అధ్యక్షుడు, రెస్కో డైరెక్టర్ అమీర్, జనసైనికులు ప్రభు, హంసగిరి, నంజుండప్ప, రాజు, మురుగప్ప, మోహన్, గిరి తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు బాల వికాసంపై శిక్షణ తరగతులు



రామకుప్పం, జనవరి 4 ప్రభాతవార్త మండలంలోని అక్షర ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఆదివారం పిల్లలకు బాల వికాస్ శిక్షణ తరగతులను శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్యాత్మిక సమన్వయకర్త డా॥ యశోద ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వారంలో ఓ రోజు ఒకటినుంచి రెండు గంటలపాటు 5-15ఏళ్ల పిల్లలకు ఈ తరగతులు జరుగుతాయన్నారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించడం, ఆరోగ్య సూత్రాలు, విద్య, కళలపై మక్కువ, సత్‌ప్రవర్తన, సత్య, ధర్మ, శాంతి, అహింసవిలువలు పెంచడంతో పాటు సేవా కార్యక్రమాలపై వివరించారు. అనంతరం పలువురు దివ్యాంగులకు వీల్‌ఛెయిర్లు, బెడ్‌షీట్లు అందించారు. కార్యక్రమంలో వి.కోట కన్వీనర్ చంద్రశేఖర్, సభ్యులు హనుమంతరావు, ప్రసాద్, కుమార్‌నాయక్, హరి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి ఐటిడిపి కృషి చేయాలి



రామకుప్పం, జనవరి 4 ప్రభాతవార్త: గ్రామస్థాయిలో తెలుగు దేశం పార్టీ బలోపేతానికి ఐటిడిపి విభాగం కృషి చేయాలని పార్లమెంట్ ఐటిడిపి అధ్యక్షులు, కనీసవేతనాల బోర్డు సభ్యుడు శరవణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద జరిగిన సమావేశంలో ఐటిడిపి నేతలు మాట్లాడారు. సామాజిక మాధ్యమాల ద్వారా పార్టీ కార్యక్రమాలు , ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లో తీసుకెళ్లాలని సూచించారు. రానున్న ఎన్నికలసందర్భంగా ఏయే కార్యక్రమాలు చేపట్టాలో చర్చించారు. సమావేశంలో ఐటిడిపి అధ్యక్షుడు రామూర్తి, నేతలు రాజేం ద్ర, వెంకటేష్, మండల అధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి కామరాజు నాయక్, నేతలు ఆనందరెడ్డి, విశ్వనాథ్, రఘు, సీతాపతి, భాస్కర్, గణేష్, సురేష్, బాలచంద్ర, ఆదిల్, దివాకర్, శంకర్‌చలం, మురళిపాల్గొన్నారు.

## నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక - కడ పి.డి



కుప్పం, జనవరి 4 ప్రభాతవార్త కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కుప్పం మండల కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు పరిష్కారం కాని భూసంబంధ సమస్యలు, పెన్షన్లు, సిఎంఆర్ఎఫ్, హౌసింగ్, ఉపాధి, సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు తదితర సమస్యలపై ప్రజలు నేరుగా తమ వినతులు అందించవచ్చన్నారు. న్యాయస్థానాల పరిధిలో ఉన్న సమస్యలు వర్తించవని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నేడు పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరుహెల్త్, జనవరి 4 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి ఎస్పీ తుషార్ డూడి చిత్తూరు జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజలు తమ సమస్యలను రాత పూర్వకంగా ఎస్పీ దృష్టికి తీసుకెళితే వాటిని పరిశీలించి సత్వరం సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ చర్యలు తీసుకోనున్నారు.

## రాజకీయ చదరంగం వల్ల వ్యవస్థలపై నమ్మకం సన్నగిల్లేనా!



బైరెడ్డిపల్లి జనవరి 4 ప్రభాతవార్త బైరెడ్డిపల్లి మండలం దేవ దొడ్డి పంచాయతీ కేంద్రంలోని వైయస్సార్సీపి నాయకుడు కార్తీక్ నిర్మించుకున్నటువంటి రేకుల షెడ్డును శనివారం రాత్రి 11:30 గంటల సమయంలో కొంతమంది జెసిపిల సాయంతో కూల్చడం జరిగినది. ఈ ప్రదేశంలో ఉండవలసిన రోడ్డు విషయమై ఆ గ్రామ సర్పంచ్ ముంతాజ్ భర్త అమీర్ కు సంబంధిత బాధితుడు కార్తీకు తగాదాలు కొనసాగి కోర్టుల వద్ద కేసులు జరుగుతున్నవి. ఈ విషయమై ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో బైరెడ్డిపల్లి మండల నాయకులు రాష్ట్ర వైఎస్సార్సీపీ ప్రధాన కార్యదర్శి ఎం కృష్ణమూర్తి ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ, కోర్టులో కేసు ఉన్న కారణం చేత ఈ తగాదాను కోర్టు ద్వారానే తేల్చుకోవలసి ఉండగా తెలుగుదేశం నాయకుల వలన ఈ విధమైనటువంటి దౌర్జన్యాలు జరుగుతున్నాయని, ఇది సమంజసం కాదని, దీనిపై జిల్లా రాష్ట్ర స్థాయి వరకు నిరసనను తెలియజేయడం జరుగుతుందని, ప్రజలను కాపాడాల్సిన వ్యవస్థలు రాజకీయ నాయకుల చెప్పు చేతలలో ఉండి ఇటువంటి దురాగతాలకు కొమ్ముకాస్తున్నాయని తెలియజేశారు. ఈ విషయమై సంబంధిత పలమనేరు రూరల్ సీఐ పరశురాముడు వివరణ ఇస్తూ దాడి జరగడం నిజమేనని, బాధితులు ఇంతవరకు తమ వద్దకు వచ్చి కంప్లైంట్ ఇవ్వడం జరగలేదని, ఇచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని, తప్పు చేసిన వారిని విడిచే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా తెలియజేశారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## టీచర్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం తగదు

### - రాష్ట్ర వైఎస్ఆర్‌టిఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రెడ్డిశేఖర్‌రెడ్డి

చిత్తూరుహెల్త్, జనవరి 4 ప్రభాతవార్త: విద్యాశాఖ టెన్త్ విద్యార్థులకు ప్రవేశపెట్టిన ఎఫ్ఎల్ఎస్ 100 రోజుల ప్రణాళికలో మార్కులు నమోదు చేయలేదని అధికారులు టీచర్లకు నోటీసులు జారీ చేయడం తగదని రాష్ట్ర వైఎస్ఆర్‌టిఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రెడ్డిశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో ఖండించారు. విద్యాశాఖ అధికారులు టీచర్లకు స్వేచ్ఛ ఇవ్వకుండా ఉత్తీర్ణత శాతం పెంపుకోసం ఇబ్బంది పెడ్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంను పర్యవేక్షిస్తున్న అధికారులు ఉపాధ్యాయులకు సన్నిహితంగా వుంటూ వారికి మరింత స్వేచ్ఛ ఇస్తే ఫలితాలు వుంటాయన్నారు. విద్యాశాఖలో ప్రస్తుతం ఇతర శాఖల అధికారుల పెత్తనం ఎక్కువైందని, సాంకేతిక సమస్యలను అధికమించడంలో అధికారులు పూర్తిగా విఫలం అయ్యారని ఆరోపించారు. తగిన కారణాలు లేకుండా ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇచ్చి బెదిరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం



కాణిపాకం, జనవరి 4 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు ఆదివారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు బెంగుళూరుకు చెందిని రాజన్ననాయుడు అనే భక్తుడు నిత్యాన్నదానంకు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవిలకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

## నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా టిక్కి రాయల్



చిత్తూరుహెల్త్, జనవరి 4 ప్రభాతవార్త: చిత్తూరు నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా టిక్కీ రాయల్ నియమితులయ్యారు. ఈ మేరకు పిపిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ జిల్లా, నగర పార్టీ అధ్యక్షులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు సిటీ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఇప్పటికే మూడు సార్లు విధులు నిర్వర్తించి, ఒక సారి చిత్తూరు అసెంబ్లీ స్థానం నుండి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన టిక్కి రాయల్‌ను మరోసారి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమించింది. ఈ మేరకు నగర పరిధిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చిత్తూరు సిటీ కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమితులైన టిక్కి రాయల్ తెలిపారు.

## డిసిసి అధ్యక్షులుగా రమేష్‌బాబు



చిత్తూరు, జనవరి 4 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా డి.రమేష్‌బాబు నియమితులయ్యారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న డి.రమేష్‌బాబును పార్టీ అధిష్టానం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమిత్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని నూతన డిసిసి అధ్యక్షులుగా నియమితులైన డి.రమేష్‌బాబు పేర్కొన్నారు. అలాగే తనకు డిసిసి అధ్యక్ష పదవి కట్టబెట్టడానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## సామాన్యుడిలా రోడ్డుపై కలియతిరిగిన చిత్తూరు ఎమ్మెల్యే



చిత్తూరురూరల్, జనవరి 4 ప్రభాతవార్త: చిత్తూరు పట్టణంలో ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పదవి, హోదాను పక్కన పెట్టి సామాన్యుడిలా తన కుమారుడితో పాటు కలియతిరిగారు. ఆదివారం గాంధీ సర్కిల్ నందు నిర్వహించే ఓ కార్యక్రమానికి ఆయన వాహనాలను పక్కన పెట్టి నడచిరావడం, టీ దుకాణం వద్ద టీ తాగి తోటివారితో కలసి హోటల్లో టిఫిన్ చేయడం అందరినీ ఆశ్చర్యపరచింది. సామాన్యుల భుజాలపై చేతులు వేసుకొని వారితో సరదాగా మాట్లాడడం, పలు విషయాలను చర్చించడంతో వారు ఆనందంతో ఆయనతో కలసి ఫోటోలు తీసుకొన్నారు.

## ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



కాణిపాకం, జనవరి 4 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చిత్తూరు జిల్లా 2026 క్యాలెండర్‌ను ఆదివారం కాణిపాకం దేవస్థానం వద్ద ఆవిష్కరించారు. 2016 సంవత్సరానికి సంభందించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చిత్తూరు జిల్లా వారు ముద్రించిన క్యాలెండర్‌ను డైరక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ పద్మావతి చేతుల మీదుగా ఆవిష్కరించారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ శాఖాధికారిణి డాక్టర్ డిటి.సుధారాణి, అదనపు డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ జి.వెంకట ప్రసాద్‌లు ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే చిత్తూరు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్, డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం సూపరెండెంట్ గిరిధర్‌రెడ్డి, సంఘం జిల్లా అధ్యక్షులు వి.శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా నేతలకు కార్మిక యూనియన్ సత్కారం



కుప్పం, జనవరి 4 ప్రభాతవార్త స్థానిక చంద్రన్న కార్మిక భవన్‌లో ఆదివారం కార్మిక సంఘ నేతలు సమావేశం అయ్యారు. ఈసందర్భంగా నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్, మాజీ ఎంపిటిసి ఉమాపతి, సంఘ అధ్యక్షుడు శివకుమార్‌లను కార్మిక సంఘ నేతలు ఘనంగా సత్కరించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రమణస్వామి, కోశాధికారి ఇస్మాయిల్, ఉపాధ్యక్షుడు నాగరాజు, సంఘనేతలు అబ్దుల్ మునాఫ్, హరి, వెంకటేష్, శివ పాల్గొన్నారు.

# రైల్వే కోడూరు డివిజన్

## సమిష్టిగా పనిచేస్తే విజయం సాధిస్తాం

### వైసీపీ జిల్లా అధ్యక్షులు.. ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి

రైల్వేకోడూరు జనవరి 4 ప్రభాతవార్త :



రానున్న సార్వత్రిక ఎన్నికలలో రైల్వేకోడూరు నియోజకవర్గం అందరూ సమిష్టిగా వైసీపీకి పార్టీకి పనిచేస్తే తప్పక విజయం సాధిస్తామని వైసిపి జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం రైల్వే కోడూరు పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో రైల్వే కోడూరు నియోజకవర్గ ఇన్చార్జి కె శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామస్థాయి, మండల స్థాయి, నియోజకవర్గస్థాయి కమిటీల నిర్మాణాలపై నిర్వహించిన నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమిష్టిగా రైల్వేకోడూరు నియోజకవర్గంలో పనిచేస్తే తప్పక విజయాన్ని సాధిస్తామని అన్నారు. అదేవిధంగా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టే ప్రతి పోరాటాన్ని గ్రామస్థాయిలోకి తీసుకెళ్లాలని వారు పాల్గొన్న వారికి తెలియజేశారు. రానున్న రోజుల్లో ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైసీపీ పార్టీ విజయం సాధిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు వజ్ర భాస్కర్ రెడ్డి, దేవనాద్ రెడ్డి తో పాటు రైల్వేకోడూరు ఉప మండల అధ్యక్షుడు రామిరెడ్డి ధ్వజ రెడ్డి, పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, ఓబులవారిపల్లి మండల నాయకులు సాయి కిషోర్ రెడ్డి, చిట్వేల్ నాయకులు చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, పెనగలూరు నాయకులు చక్రపాణి, పుల్లంపేట జెడ్పిటిసి దార్ల రామనాథం, వైసీపీ సీనియర్ నాయకులు ఉప సర్పంచ్ తోట శివ సాయి, ఓబులవారిపల్లి సీనియర్ నాయకులు దుర్గా నాగేంద్ర, పంజం వేణుగోపాల్ రెడ్డి, జడ్పిటిసి పాలెం కోట రత్నమ్మ, వార్డు మెంబర్లు ఎంపీటీసీలు ఐదు మండలాల నాయకులు పాల్గొన్నారు

## పెనగలూరు మండలాన్ని రాజంపేట రెవెన్యూ డివిజన్లో కలపండి



పెనగలూరు డిసెంబర్ 4 ప్రభాతవార్త

తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం పెనగలూరు అనగానే ఉమ్మడి కడప జిల్లాలో మారుమూల ప్రాంతంగా ప్రసిద్ధి. గతంలో పెనగలూరు మండలం రాజంపేట నియోజకవర్గం లో ఉండేది. కొందరు ఎన్నికల వ్యూహంలో భాగంగా పెనగలూరు మండలం రైల్వేకోడూరు నియోజకవర్గంలో కలిపారు. ఆనాటి నుండి ఈనాటి వరకు పేరుకే రైల్వేకోడూరు నియోజకవర్గం గానీ ప్రజల వారి యొక్క మనసులో రైల్వే కోడూరు వారి సంత ప్రాంతంగా గుర్తించలేదు. కారణం ఎన్నో దశాబ్దాలుగా రాజంపేట పెనగలూరు లో ఉన్న బంధమే. పెనగలూరు మండలంలో ఉన్న 16 పంచాయతీలు చెందిన ప్రజలు ఏ చిన్న పని కోసమైనా రాజంపేటకు వెళ్తారు. వ్యాపార, విద్య, బంధుత్వం పరంగా పెనగలూరు కి రాజంపేట తో ఉన్న సంబంధం ప్రత్యేకమైనది పరిపాలనా పరంగా తీసుకుంటే మండల ప్రజలు రెవెన్యూ డివిజన్ ఆఫీసుకు వెళ్లాలంటే అర్ధగంటలో వెళ్లి వారు యొక్క పనులు చేసుకునే సౌలభ్యం ఉంటుంది. రాజంపేట నుండి పెనగలూరు కి 18 కిలోమీటర్లు మాత్రమే దూరం ఉంటుంది ప్రజలు వారి యొక్క అవసరాల కోసం వెళ్ళుటకు అనువైన చోటు రాజంపేట అలాంటి మా పెనగలూరు మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపడం బాధాకరం. రాయచోటి జిల్లా కేంద్రంగా ఏర్పడినప్పుడు నుండి పెనగలూరు మండల ప్రజలు కలెక్టరేట్ కి పోవాలంటే అవస్థలు అన్నీఇన్నీ కావు. రైల్వేకోడూరు ని తిరుపతి జిల్లాలో కలపడం వల్ల మా పెనగలూరు మండలానికి తీవ్ర నష్టం కలుగుతుందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మానసికంగా కూడా పెనగలూరు మండలం ప్రజలు తిరుపతి జిల్లాలో కలిసేందుకు జీర్ణించుకోలేకున్నారు రాజకీయంగా చైతన్యం కలిగిన ప్రజలు ఉన్నారు పెనగలూరు మండలాన్ని రాజంపేట నియోజకవర్గంలో కలపడం చారిత్రిక అవసరం నేటి రాజకీయ లెక్కలతో చూడకుండా ప్రజల అవసరాలని ఆమోదాన్ని మనోభావాల్ని పరిధిలోకి తీసుకుని పెనగలూరు మండల ప్రజల్ని అన్ని విధాలుగా అభివృద్ధి చెందేలా మా ప్రాంతానికి పాలన సులభతరం చేసేలా పెనగలూరు మండలాన్ని రాజంపేట నియోజవర్గంలో కలపడం నాయబద్ధమైనది కావున ఈ న్యాయబద్ధమైన ప్రక్రియ కూడా పూర్తిచేసి మా మండలాన్ని రాజంపేట నియోజకవర్గంలో కలిపావాల్సిందిగా ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రిని మా మండల ప్రజల తరఫున అభ్యర్థిస్తున్నాను మా న్యాయబద్ధమైన ఈ సమస్యని ఆలోచించి మాకు న్యాయం చేయాలని పెనగలూరు మండల యువ నాయకులు ఏనుగుల శివ, అలిశెట్టి నవీన్ రాజ్, ఏంజెర్ల సాయికుమార్ రెడ్డి ప్రభుత్వానికి పత్రికా ప్రకటన ద్వారా విన్నవించుకున్నారు.

## 6న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి



రైల్వేకోడూరు, జనవరి 4 ప్రభాతవార్త :

రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన నిరుద్యోగులకు ఈనెల 6న ఉచిత జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది నిర్వహించిన జాబ్ మేళాలో దాదాపు 200 పై చిలుకు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభించడంతో ప్రతి గ్రామంలో నుంచి వస్తున్న వినతుల కారణంగా తిరిగి పరిశ్రమల యాజమాన్యాన్ని ఒప్పించి ఈనెల ఆరవ తేదీన మంగళవారం రోజున జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క నిరుద్యోగ యువత ఉపయోగించుకొని తమ జీవితాలను మెరుగు పరుచుకోవాల్సిందిగా పంతగాని కోరారు.

## క్రైస్తవ భక్తులకు చీరలు పంపిణీ

రైల్వేకోడూరు జనవరి 4(ప్రభాతవార్త )



రైల్వే కోడూరు పట్టణంలోని ఎస్ ఏ ఎల్ సి చర్చి నందు ఆదివారం సంఘ చైర్మన్ పాలెం భాను మరియు సంఘస్తుల ఆధ్వర్యంలో దాదాపు 100 మంది మహిళ క్రైస్తవులకు చీరలు పంపిణీ చేసినట్లు చైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని వివిధ గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన మహిళ భక్తులకు చీరలను పంపిణీ చేశామని తెలిపారు ముఖ్యంగా ప్రతి ఏటా నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మహిళా భక్తులకు చీరలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఇమ్మానుయేల్ బాబు, ఉపాధ్యక్షులు కిషోర్, ట్రెజరర్, చౌడవరం భాస్కర్ తో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు

# తిరుపతి డివిజన్

## మా రెవెన్యూ గ్రామ పరిధిలో గ్రావెల్, మట్టి ఎత్తవద్దు!



విజయపురం, జనవరి 4 ప్రభాతవార్త: మండలంలోని పాతార్కాడు గ్రామస్తులు మా గ్రామ రెవెన్యూ పరిధిలో క్వారీలు ఎత్తవద్దని వేడుకుంటున్నారు. గత ప్రభుత్వంలో గ్రావెల్ అనుమతి పొంది విచ్చలవిడిగా తమిళనాడు తరలించి కోట్లు సంపాదించుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీనిపై పలుమార్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం, సీపీఐ, టీడీపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ ధర్నా నిర్వహించిన కూడా మిమ్మల్ని పట్టించుకోవడం లేదు. మేము గట్టిగా నినాదాలు చేయడంతో మాపై కేసులు బనాయించారు. మమ్మల్ని జైలు పంపించారు. మా గ్రామ రెవెన్యూ లెక్క దాఖల్లో సర్వే నెం.96/1లో 62 ఎకరాల విస్తీర్ణం కలదు. ఇది ప్రభుత్వ భూమి కావడంతో కొంత మంది బడా నాయకులు ఆ భూమిపై కన్ను పడ్డాయి. దాంతో అప్పట్లో వైసీపీ ప్రభుత్వం కావడంతో మాజీ ఎమ్మెల్యే రోజా మద్దతు పలకడం వలన గ్రావెల్‌కు అనుమతి పొంది కోట్లు సంపాదించుకున్నారు. అదే సమయంలో 2024 ఎన్నికలు సమయం కావడంతో ఆ నాటి ప్రతిపక్ష నేత, ప్రస్తుతం స్థానిక ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవ తీసుకుని అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు నగరి పర్యటనలో ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అప్పుడు చంద్రబాబు బహిరంగ సభలో విజయపురం మండలం, పాతార్కాడు గ్రామానికి చెందిన గ్రామ ప్రజలకు టీడీపీ ప్రభుత్వం అధికారం వచ్చిన వెంటనే మీకు ఇంటి స్థలం, భూ పంపిణీ కార్యక్రమంలో భాగంగా నిరుపేదలకు వ్యవసాయం చేయడానికి పాసుపుస్తకాలు పంపిణీ చేస్తానన్నారు. ఆ క్రమ ంలో అప్పటికి ఆ క్వారీ తవ్వకాలను నిలిపి వేయబడ్డాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో అప్పుడు అనుమతి పొందిన బడా నాయకులు, ఇతరులతో కుమ్మక్కై ప్రజా అభిప్రాయ వేదిక నిర్వహించారు. ప్రజా అభిప్రాయ సేకరణ వేదికల్లో మైనింగ్‌కు సంబంధించిన అధికారులు, జేసీ, ఆర్డీవో హాజరయ్యారు. ఆ క్రమంలో గ్రామ ప్రజలు అందరూ మూ కుమ్మడిగా ఏకాభిప్రాయంతో ఈ భూములు ఎటువంటి క్వారీ కాని, కార్యకలాపాలు కానీ ఏర్పాటు చేయవద్దని డిమాండ్ చేశారు. కావున పేద ప్రజల పచ్చపాతి అయినా చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రత్యేక శ్రద్ధ వహించి గ్రామంలో పర్యటించి, ఆ భూములను పరిశీలించి, కూటమి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పేద ప్రజలకు భూ పంపిణీ కార్యక్రమం చేపట్టాలని స్థానిక గ్రామస్తులు వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నారు.

## తహశీల్దార్‌ను నియమించండి మహాప్రభో..!

### వైకాపా మాజీ మండల అధ్యక్షులు బర్రె



శ్రీకాళహస్తి రూరల్, జనవరి 4 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలానికి తహ శీల్దార్‌ను నియమించాలని శ్రీకాహస్తి మండల తొండమాన్‌పురం సర్పంచ్, వైకాపా మాజీ మండల అధ్యక్షులు బర్రె హేమభూషణ్‌రెడ్డి కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన తొండమాన్‌పురంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి మండలంలో ఇద్దరు తహ శీల్దార్లు మారరాని మండలంలో పేరుకుపోయిన రెవెన్యూ సమస్యలు,ఆదాయ ధృవీకరణ పత్రాలకు పరిమితమైన డిటిలు తదితర అంశాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. 46 పంచాయితీలు ఉన్న ఈ మండలానికి తహాశీల్దార్ లేకపోవడం,పిజిఆర్ఎస్ కలెక్టర్ కార్యలయం నుంచి వచ్చే స్పందన వినతులు ప్రజాదర్బార్ నుంచి వచ్చే సమస్యలు ఎక్కడ వేసిన గంగొళి అక్కడ ఉన్నట్టు ఉంది. ఇప్పటికైన కలెక్టర్ స్పందించి రెగ్యూలర్ తహశీల్దార్‌ను నియమించాలని ఆయన కోరారు.

## భూగర్భ,గనుల డైరక్టర్‌కు స్వాగతం



శ్రీకాళహస్తి జనవరి 4 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రగనులు,భూగర్భశాఖ డైరక్టర్ డబ్ల్యు చంద్రశేఖర్ దంపతులకు ఎంజిఎ్గ్రూప్ ఆఫ్ అధినేతలు జి.మల్లికార్జున్ నాయుడు. జి.మ యూర్‌లు ఎంజిఎం హోటల్ నందు ఘన స్వాగతం పలికారు. జి.మయూర్ మాట్లాడుతూ ఎంజిఎం హోటల్ నందు ఉన్న రుద్రాక్ష చెట్లకు చంద్రశేఖర్ దంపతులు వారు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గనుల శాఖఅధికారులు బాలాజినాయక్,సత్యనారాయణ మైన్సు లీజుదారులు పాల్గొన్నారు. అనంతరం వారు శ్రీకాళహస్తీశ్వరాలయ రాహుకేతుపూజ దర్శనానికి వెళ్ళారు.

## శివయ్య సేవలో సినీ డైరెక్టర్ అనిల్



శ్రీకాళహస్తి,జనవరి 4 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ప్రముఖ సినీ డైరెక్టర్ అనిల్ రావిపూడి పూజలు జరిపించుకున్నారు. ఆయన రాక సందర్భంగా దక్షిణ గోపురం వద్ద ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్ ఎఇఒ మోహన్, ఎపిఆర్‌ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న రావిపూడికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.

## 6 నుంచి సహకార సంఘ ఉద్యోగుల రిలేదీక్షలు

శ్రీకాళహస్తి,జనవరి 4 ప్రభాతవార్త: రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పని చేస్తున్న ఉద్యోగులు తమ సమస్యల సాధనకు ఈ నెల 6 నుంచి రిలేదీక్షలు చేపట్టనున్నట్లు తిరుపతిజిల్లా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పప్పు చిరంజీవి రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రిలేదీక్షల్లో ఉద్యోగులందరూ పాల్గొనాలని ప్రణాళికలు రూపొందించుకొని దశలవారి ఆందోళనలు చేపట్టాలని ఆయన సూచించారు.

## సూర్యభగవానునికి ప్రత్యేక పూజలు



ఏర్పేడు,జనవరి 4 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజక వర్గంలోని ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వరుని ఆలయంలో వెలసిన సూర్యభగవానునికి ఆదివారం ప్రత్యేక పూజలు అలంరారాలు జరిపారు. ఆదివారం సూర్యభగవానునికి ప్రత్యేకం కాబట్టి పూజలు అలంకారాలు నిర్వహించారు. ఆలయానికి ధర్మకర్తల మండలి ఏర్పడిన తరువాత చైర్మెన్ బత్తల గిరిబాబునాయుడు చొరవతో ప్రత్యేక కార్యక్రమాలు సేవలకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మొదటి సారి ఆరుద్ర వస్త్ర సేవకు శ్రీకారం చుట్టారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సత్యవేడు, జనవరి 4 ప్రభాతవార్త: సత్యవేడు మండలం దాసుకుప్పం సబ్‌స్టేషన్ పరిధిలో జనవరి 5వ తేదీ(నేడు) విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు స్థానిక విద్యుత్ శాఖ ఏఈ వాసుదేవయ్య పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దాసుకుప్పం, చెన్నేరి, పుదుకుప్పం, మదనంజేరి, అంబాకం, సీతారాంపేట, కదర్వేడు, బాలకృష్ణాపురం, సిరుణంబుదూరు, పేరడం తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

## మునెమ్మ మృతికి నివాళి



పుత్తూరు రూరల్, జనవరి 4 ప్రభాతవార్త: పుత్తూరు మున్సిపాలిటీ 16వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి లక్ష్మణాచారి తల్లి మునెమ్మ మృతి చెందింది. ఆమె మృతికి టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు పూలమాల వేసి నివాళులర్పించారు.

## విధేయతకు పట్టం

శ్రీకాళహస్తి జనవరి 4 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులుగా మరోసారి బాలగురువ బాబుని నియమించిన సందర్భంగా వారిని పూలమాలలతో దుశ్శాలువలతో సన్మానించామని కాంగ్రెస్‌పార్టీ సమన్వయకర్త తలపాదామోదరం రెడ్డి అన్నారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సురేంద్రరెడ్డి,పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోని,నవీన్‌లు ఉన్నారు.

## ఢిల్లీబాబుకు పరామర్శ



శ్రీకాళహస్తి జనవరి 4 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు బాలు ఢిల్లిబాబు అనారోగ్యంతో చైన్నె కెవిటి ఆసుపత్రిలో తన ఏడమకాలుకు చికిత్స చేసుకున్నారని పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్ అన్నారు. ఆ మేరకు పార్టీ యువనాయకులు తన నివాసంలో ఆయన్ను పలకరించి తన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.ఏ అవసరమైన తెలుగుదేశం పార్టీ ముందుంటుందని ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు రాకేష్, శ్రీను, బాల, సుబ్రమణ్యం, శరవణ, కుమార్, పెంచులయ్యలు పరామర్శించారు.

## శివయ్య సేవలో కేంద్ర మంత్రి



శ్రీకాళహస్తి,జనవరి 4 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయులింగేశ్వరుని ఆదివారం కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి వేదపండితులతో స్వాగతం పలికారు. మంత్రికి ఆలయ ఎఇఒలు విద్యాసాగర్‌రెడ్డి, వమోహన్‌లు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

## తిరుచ్చి వాహనంపై శ్రీ సీతారామలక్ష్మణులు



చంద్రగిరి, జనవరి 4 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ సీతారామలక్ష్మణ సమేత హనుమంతుడు తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాధ్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భగవద్గీతను పాఠ్యాంశంగా ప్రవేశ పెట్లాలి!



శ్రీకాళహస్తి,జనవరి 4 ప్రభాతవార్త: పవిత్రమైన భగవద్గీతను రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టాలని కృష్ణా ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు ఎం మునికృష్ణారెడ్డి కోరారు. ఆదివారం భగవద్గీతను తెలుగులో చదివే విదంగా రూపొందించి అందించారు. విద్యార్థుల్లో వ్యక్తిగత వికాసానికి ధర్మబద్ధమైన జీవితానికి దోహదపడు తుందని మునికృష్ణారెడ్డి వివరించారు.

## విశ్వసనీయత..విధేయతకు మళ్ళీ పదవులు

### -కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యం
### -తిరుపతి జిల్లా అధ్యక్షుడుగా బాలగురవంబాబు, నగర అధ్యక్షుడుగా గౌడపేరు



తిరుపతి,జనవరి 4ప్రభాతవార్త: పార్టీపట్ల విశ్వస నీయత... విధేయత, కష్ట కాలంలోనూ సుదీర్ఘకాలంగా పార్టీని నమ్ముకుని చేస్తున్న సేవలకు గుర్తింపుగా తిరుపతి జిల్లాలో ఇద్దరు కీలక నేతలకు కాంగ్రెస్ పార్టీ మళ్ళీ అదే పదవులు దక్కడం నిదర్శనం, కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడుగా బాలగురవం బాబు, తిరుపతి నగర అధ్యక్షుడుగా గౌడపేరు చిట్టిబాబు నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేయడం, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై పోరాటం సాగించడంలో కీలకంగా ఉన్న నాయకులకు అదే పదవులు అప్పగించడంప ఏఐసిసి పరిశీలకులు కృత నిశ్చయలయ్యారు. పార్టీలో కార్యకర్తల నుండి నాయకుల వరకు, క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువగా ఉంటున్న నేతలకు పదవులు రావడం పట్ల పార్టీ నేతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పార్టీకి తిరిగి సేవ చేసే అవకాశం కల్పించిన ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీ, మాజీ జాతీయ అధ్యక్షురాలు సోనియాగాంధీ, పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి,ఏఐసిసి ప్రధాన కార్యదర్శివేణుగోపాల్, ఇన్‌ఛార్జి మాణిక్యం ఠాగూర్‌కు, గణేశ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## లూయిస్ బ్రెయిలీ 217వ జన్మదిన వేడుకలు



తిరుపతి క్రీడ, జనవరి 4 ప్రభాతవార్త: అంధుల చదువు సృష్టికర్త, అంధుల ఉజ్వల భవిష్యత్తులకు బంగారు బాటలు వేసి స్ఫూర్తి ప్రధాతగా నిలిచిన శ్రీలూయిస్ బ్రెయిలీ 217వ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నవారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన అనిమిని హిమ బిందు గారు చేతుల మీదుగా అందులకు దుస్తులను విద్యార్థులకు యువకులకు దుస్తులు అందజేశారు. విశ్వ చేయూత అందుల సహకార సంఘం అధ్యక్షులు. మునిరత్నం, తోట వాసుదేవు, రంజిత్, డిస్టిక్ స్పోర్ట్స్ అథారిటీ అధికారి శశిధర్, చిన్నారి భరోసా చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ వి.జి. ప్రేమ్ నాథ్, టాలెంట్ స్కేటింగ్ అకాడమీ, అధ్యక్షులు జి. ప్రతాప్, డాక్టర్ చలపతి, కేఎస్ ఆశ్చర్య, నవజీవనం, చైర్మన్ ప్రదీప్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, మధుసూదన్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ అవార్డ్స్ పోస్టర్ ఆవిష్కరణ



తిరుపతి హెల్త్, జనవరి 4 ప్రభాతవార్త: ఏపీ స్టూడెంట్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ప్రతిభ అవార్డ్స్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రి యాదవ్ తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రతిభ అవార్డ్స్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. స్కూలు, కాలేజీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను గుర్తించి, వారిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హేమాద్రి యాదవ్ పేర్కొన్నారు. విద్యారంగంలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు అవార్డులు అందజేసి, వారి భవిష్యత్‌కు మరింత ఉత్సాహాన్ని అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో జేఏసీ జిల్లా అధ్యక్షులు గార్లపాటి శ్రీధర్, నగర అధ్యక్షులు వెంకటేష్, ఎస్వీయూ అధ్యక్షులు నిఖిల్, ఉపాధ్యక్షులు మహేంద్ర తదితర నాయకులు పాల్గొని కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

## ఎన్జీవోస్ తాలూకా మహిళా విభాగం చైర్ పర్సన్‌గా పసుపులేటి



తిరుపతి హెల్త్, జనవరి 4 ప్రభాతవార్త: ఏపీ ఎన్జీవోస్ తాలూకా మహిళా విభాగం చైర్ పర్సన్ గా పసుపులేటి [illegible] నియమితులయ్యారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోం నందు తిరుపతి జిల్లా అధ్యక్షు లు సురేష్, తాలూకా అధ్యక్షులు శ్రీనివా సులు, రాష్ట్ర మహిళా జాయింట్ సెక్రెటరీ సుబ్బలక్ష్మి అధ్యక్షతన జిల్లాలోని వివిధ శాఖలో పనిచేస్తున్న ప్రభుత్వ మహిళా ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి తాలూకా మహిళా విభాగం కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షులు ప్రకటించారు. ఇందులో చైర్ పర్సన్‌గా స్టాఫ్ నర్స్ పసుపులేటి మోహన, వ్యవసాయ శాఖ నుండి కో చైర్ పర్సన్‌గా పరిపూర్ణ, కోశాధికారి అరుణ, వైస్ చైర్మన్లుగా వర్షిని ఆర్అండ్ బి, తేజ విద్యాశాఖ, రెడ్డి కుమారి మెడికల్, రుక్మిణి, దేవి, జాయింట్ కన్వీనర్లుగా బిందుప్రియా, ప్రమీల మంజువాణి, భాగ్యలక్ష్మి, కన్వీనర్ మంజులత, కో కన్వీనర్ అంజమ్మ నియమితులయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ ప్రేమలత, తాలూకా జాయింట్ సెక్రెటరీలు భువనేశ్వరి, పద్మజ, వాణిలు పాల్గొన్నారు.

### విద్యుత్ సమస్యలపై
## నేడు డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి

తిరుపతి,జనవరి 4ప్రభాతవార్త: ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం పరిదిలోని తొమ్మిదిజిల్లాల్లో వినియోగదారుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు నేటి ఉదయం "డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి" కార్యక్రమం జరుగుతుంది. తొమ్మిది జిల్లాల్లోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను సిఎండి శివశంకర్ లోతేటికి ఉదయం 10.30గంటల నుండి 12.30వరకు నేరుగా ఫోన్‌ద్వారా 8977716661నంబర్‌కు తెలియజేయాలని తెలిపారు. వినియోగదారులు తమ విద్యుత్ సర్వీస్ నంబర్‌ను అందుబాటులో ఉంచుకోవాలని పిఆర్‌ఒ టి.మధుసూదన తెలిపారు.

## స్వాతంత్ర్య సమరంలో సిపిఐ విరోచిత పోరాటం



చంద్రగిరి, జనవరి 4 ప్రభాతవార్త: స్వాతంత్ర్య సమరంలో సిపిఐ వీరోచిత పోరాటం చేసినట్లు పార్టీ జిల్లా కార్యదర్శి పి.మురళి అన్నారు. స్థానిక ఇందిరమ్మ కాలనీ వద్ద ఆదివారం సిపిఐ మండల సభ్యులకు ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రగిరి నుండి సత్యవేడు వరకు ఏ బూర్జువా పార్టీలు చేయనిరీతిలో వేలాది మంది పేదలకు సాగు భూములు, ఇళ్ళస్థలాలను పంచిపెట్టిన ఎకైక పార్టీ సిపిఐ అన్నారు. పారిశ్రామిక అభివృద్ది కొరకు విలువైన వేలాది ఎకరాలను బడాబాబులకు అప్పగిస్తున్నారంటూ దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వెంకట రమణ, సిపిజి జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రాధాకృష్ణ, చంద్రగిరి మండల కార్యదర్శి ఎన్.శ్రీరాములు, పాకాల మండల కార్యదర్శి ప్రకాష్, కెవై రాజా, లక్ష్మీపతి, రవి, పార్వతి, దేశమ్మ, సునీల్, షరీఫ్, బుజ్జి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా యువనేత కందనూరు



తిరుపతి కలెక్టరేట్, డిసెంబర్ 4 ప్రభాతవార్త : పేదలకు అండగా జనసేన యువనేత కందనూరు జగదీష్ నిలుస్తు న్నారు. ప్రజాసేవే పరమార్ధంగా రాజకీయ రంగాన్ని ఎంచు కున్న జనసేన అధ్యక్షులు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో తిరుపతి జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా జనసేన నాయకులు, జగద్‌ఈషా విలేజ్ లివింగ్ కంపెనీ అధినేత కందనూరు జాగదీష్ పెళ్లకూరు మండలంలోని నెలబల్లి భీమవరం గ్రామంలో గత 30 సంవత్సరాలుగా అంగవైకల్యంతో బాధ పడుతున్న యువతి కి నగదుతో పాటు నిత్యవసర వస్తువులను అందజేసి వారి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామి ఇచ్చారు. ఈకార్యక్రమంలో జనసేన నాయకులు సుభాష్ వర్మ,వినోద్ కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## లక్కీస్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం



తిరుపతి కలెక్టరేట్, జనవరి 4 ప్రభాతవార్త : .లక్కీస్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సాయిరాం సేవలు అభినందనీయమని డిఎంహెచ్ బాలకృష్ణ నాయక్ అన్నారు. తిరుపతిలోని ఓ హోటల్లో ఆదివారం లక్కీస్ చారిటబుల్ ట్రస్ట్ వారిచే రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం వారి సహకారంతో రూ.మూడు లక్షల విలువ చేసే జైపూర్ కాళ్లు చేతులు వివిధ రకాల ప్రమాదాలకు గురి అయ్యి అంగ వైకల్యం చెందిన 50 మంది అంగవైకల్య బాధితులకు జైపూర్ కాళ్లు చేతులు కొరకు కొలతలు తీసుకోవడం, త్వరలో వారికి పంపిణీ చేయడం జరగనుంది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధినేత సాయిరాం తో పాటు త్రిపుర ఖమ్మం రోటరీ క్లబ్ సెక్రటరీ సాంబశివరావు, వైస్ ప్రెసిడెంట్ రంగారావు, ప్రతినిధి వంశీ, బాధితులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బహుజన టీచర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



తిరుపతి కలెక్టరేట్, జనవరి 4 ప్రభాతవార్త :ఆంధ్రప్రదేశ్ బహుజన టీచర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్, స్టిక్కర్లు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ బహుజన టీచర్స్ అసోసియేషన్ జాతీయ రాష్ట్ర గౌరవ సలహాదారు గుండ్లపల్లి ఆంజినేయులు ఆధ్వర్యంలో నిర్వ హించడం జరిగింది. ఈ కార్యక్రమానికి బిటిఏ నాయకలు చిత్తూరు జిల్లా అధ్యక్షులు తేనెబండ్ల విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి. రామమూర్తి, తిరుపతి జిల్లా ట్రెజరర్ వెంకటయ్య, తిరుపతి పట్టణ కార్యదరి గురుస్వామి, పాకాల మండల అధ్యక్షులు జ్యోతి ప్రసాద్, కార్యదర్శి వెంకటాచలం విజయమోహన్, రామచంద్ర, అదికేశవులు, జయబాల, క్రిష్ణమూర్తి, గిరి, గణేష్, తలనీరాం, సుబ్బయ్య, చలపతి, రాజు, నాగరాజు, బాలక్రిష్ణ, గోపి తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ చైర్మెన్‌కు సన్మానం



తొట్టంబేడు జనవరి 4 ప్రభాత వార్త: నూతనంగా ఉమ్మడిజిల్లా గ్రంథలయ సంస్ద చైర్మెన్‌గా నియమితమైన రెడ్డివారి గురు వారెడ్డిని జిల్లా గ్రంధలయ ఉద్యో గుల సంఘం ఆదివారం మర్యాద పూర్వకంగా వారి స్వగ్రామమైన ఏర్పేడు మండలం బండారుపల్లిలో వెళ్ళి సత్కరించారు. ఈ మేరకు వారు గురువారెడ్డి చేతుల మీదుగా కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతూ సంబరాలు జరుపుకు న్నారు. ఈ సందర్భంగా గురు వారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఉన్నట్టువంటి గ్రంథాల యాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అహర్నిశలు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో గ్రంధలయ ఉద్యోగ సంఘ నాయకులు శివప్రసాద్, రవీంద్ర బాబు, తులసీనాయక్, చంద్రశేఖర్‌నాయక్, నాగరాణి, రెడ్డమ్మ,రాజు, రెడ్డికుమారి, ప్రమీల, జిలానీబాషా,ప్రసాద్,జీవన్,విశ్వప్రసాద్‌లు పాల్గొన్నారు.

## విజయవాడ ఎగ్జిబీషన్‌లో శ్రీకాళహస్తి కళా కృతులు



శ్రీకాళహస్తి,జనవరి 4 ప్రభాతవార్త: విజయవాడ మహానగరంలో మేది స్టెల్లా ఇండోర్ స్టేడియంలో ఖాధీ మహోత్సవంను ప్రభుత్వం ఏర్పాటు చేసారు.ఈ మహోత్సవంలో సుమారు. 100 స్టాళ్ళకు అవకాశం కల్పించారు. సమాజంలో ఒకప్పుడు కీలకంగా ఉన్న ఖాధీ,గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తులు భారీ పరిశ్రమల ధాటికి తట్టుకోలేకపోతు న్నాయి. ఈ నేపథ్యంలో వారిని ప్రోత్స హించుటకుమన సంప్రదాయ కళలకు సంబధించి కళాకారులకు సంబందించి ఈ తరానికి తెలియజేయటానికి ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబీషన్‌లు దోహద పడుతున్నాయి.ఈ నెల 12వరకు ఏర్పాటు చేసిన ఎగ్జిబీషన్‌లో శ్రీకాళహస్తి నుంచి కలంకారి, కొయ్య బొమ్మల ఏర్పాటుకు అవకాశం కల్పించారని అందుకు లోక్ సభ సభ్యుడు కేశనేని శివనాథ్‌కు కళాసృష్టికి చెందిన డాక్టర్ గుమ్మడి దశరథాచ్చారి ధన్యవాదాలు తెలిపారు.ఆయనకు కొయ్యబొమ్మల ప్రాశస్త్యంను తయారుచేసే విధానాలను వివరించారు.కళాకారుల చాతుర్యాన్ని శివనాధ్ ప్రసంశించారు.

## టీడీపీ అధ్యక్షుడుచే ఘనంగా రుద్రాభిషేకం

వరదయ్యపాల్యెం, జనవరి 4 ప్రభాతవార్త: వరదయ్యపాలెంలోని స్థానిక శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత త్రయంబకేశ్వరాలయంలో శనివారం తెదేపా మండల అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి దంపతులు అధ్వర్యంలో మహన్యాస రుద్రాభిషేకం, అన్నాభిషేకం వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఆరుద్ర దర్శనం పురస్కరిం చుకుని ఆలయంలో దర్మకర్త పన్నెం నిర్మల్ పర్యవేక్షణలో వేదపండితులు రాజేంద్రప్రసాద్ శర్మ, మధుసూదనశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి స్నుగధ ద్రవ్యాలు. పంచామృత అభిషేకం, పుస్పాభిషేకం బిల్వపత్రార్చన వంటి పూజలు శాస్త్రోక్తంగా జరిగింది. అనంతరం అన్నదానం చేపట్టారు. పాలకమండలి సభ్యులు బొప్పన మోహనమురళి, రాజేష్ పారిక్ ఎంపీపీ పద్మావతి, దామోదర్ రెడ్డిలు పాల్గొన్నారు.

## పది విద్యార్థులకు రామాయణం ప్రదర్శన



బుచ్చినాయుడు కండ్రిగ, జనవరి 4 ప్రభాతవార్త: మార్చి 16వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షల సన్నద్ధతలో భాగంగా మండలంలోని కల్లివెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతుల నిర్వహణలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు రామాయణంను ప్రదర్శించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాణి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళి తెలుపుతూ పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశంలోని ఉపవాచకమైన రామాయణంలో కాండలు వాక్యాలు, పాత్ర స్వభావం, వ్యాసరూప ప్రశ్న, జాతీయాలతో పాటు 22 మార్కులు వరకు ఈ ఉపవాచకం రామాయణం నుంచి అడుగుతారని ఇప్పటికే విద్యార్థులకు రామాయణం బోధనతో పాటు వివరించగా, ఒక సారి విద్యార్థులు సంపూర్ణ రామాయణం చిత్రం ప్రత్యక్షంగా కథన రూపంలో చూస్తే ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అందులో భాగంగానే రామాయణం చిత్రాన్ని పాఠశాలలో ఉన్న టీవీలో చూపిస్తూ అందులోని పాత్రలను విద్యార్థులకు ఉపయుక్తంగా వివరించి చెప్పినట్లు తెలిపారు. నేటి నుంచి నిర్మాణాత్మక మదింపు-3 ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు.

# టిడిపి నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు



నాయుడుపేట, జనవరి 4 ప్రభాతవార్త: నాయుడుపేటలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వైఎస్ఆర్సి పి పార్టీ జెండా కప్పి వంద మందికి పైగా పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక విఫలమైన ఏకైక ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం నిలిచిందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. బూటకపు మాటలు అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబు నెంబర్ వన్ అని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆయన తెలియజేశారు. రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే మోసపూరిత వాగ్దానాలు. అబద్దాలు. చెప్పడంలో సీఎం చంద్రబాబు నాయుడు నంబర వన్ స్థానంలో ఉంటారని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తీవ్రంగా విమర్శించారు. నాయుడుపేట పట్టణంలోని సంజీవయ్య క్యాంపు కార్యాలయంలో ఆదివారం తిపలపూడి నాగరాజ్ తో పాటు మరో వందమంది టిడిపి నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సంజీవయ్య చొరవతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, విన్నమల గ్రామ వైసిపి నాయకులు అనిల్‌రెడ్డిల సారథ్యంలో పార్టీలో చేరిన వాళ్లకు సంజీవయ్య వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. టిడిపి వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు నిరాశపడి మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి వస్తున్న ప్రజాదరణ చూసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ఆయన వెల్లడించారు. టిడిపి నుంచి వైఎస్ఆర్సి పి కుటుంబంలోకి వారిని సాదరంగా ఆహ్వానించినట్లు మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామని చెప్పి మహిళలను, నిరుద్యోగులను, రైతులను, మోసం చేస్తున్నారని ఆయన అసంతృప్తి చెందారు.

## బైకు బైకు ఢీ ఒకరికి స్వల్ప గాయాలు



దొరవారిసత్రం, జనవరి 4 ప్రభాతవార్త: దొరవారిసత్రం మండల పరిధిలోని కుప్పారెడ్డి పాలెం గ్రామం వద్ద బైకు బైకు ఢీకొన్నాయి. ఈ ఘటనలో నెలబల్లి గ్రామానికి చెందిన వెంకటయ్యకు స్వల్ప గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో హుటాహుటిన క్షతగాత్రుని నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వెంకటయ్యకు కుడి చెయి విరిగిందని తలకు స్వల్ప గాయమైనట్లు తెలిపారు. 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి దార్ల సాల్మన్ రాజు, పైలట్ కాకాని అంకయ్య సకాలంలో ఆసుపత్రికి తరలించార కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## కోడి పందెల స్థావరాలపై పోలీసులు మెరుపు దాడులు



దొరవారిసత్రం, జనవరి 4ప్రభాతవార్త: దొరవారిసత్రం మండలంలో ఆదివారం సీఐ సంగమేశ్వర రావు ఆదేశాలతో ఏఎస్ఐ నాగరాజు మండల పరిధిలోని రామరెడ్డి కండ్రిగ గ్రామ శివారులో కోడిపందాలు ఆడుతున్న స్థావరాలపై పోలీసులు మెరుపు దాడి చేశారు. కోడి పందాలు ఆడుతున్న నలుగురిని పట్టుకున్నారు. వారి దగ్గర నుంచి రెండు కోళ్లు, రెండు బైకులు, 540 రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నామని వారిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఏ ఎస్ ఐ నాగరాజు తెలిపారు. వీరితో పాటు సుబ్రహ్మణ్యం, అమర్నాథ్, భరత్, నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

## మా ప్రాణాలకు రక్షణ కరువు




నాయుడుపేట, జనవరి 4 ప్రభాతవార్త: నాయుడుపేట పట్టణం 2వ వార్డులోని ఎన్ఎస్ఆర్ కాలనీ వద్ద రైల్వే గేట్ దాటుతూ ఒకరు మరణించారని ఎన్ఎం ఆర్ కాలనీ నివాసులు ఆదివారం రెండవ వార్డ్ కౌన్సిలర్ నాగార్జున కాలనీ వాసులతో కలిసి కాలనీ వద్ద ఉన్న రైల్వే గేటు ను ఆయన సందర్శించారు. అక్కడ రైల్వే అండర్ పాస్ కోసం కౌన్సిలర్ నాగార్జునతో పాటు గ్రామస్తులు పలుమార్లు అధికారులకు. నాయకులకు వినతి పత్రాలు సమర్పించారు. అయినా అండర్ బ్రిడ్జ్ ఏర్పాటు కాలేదు అని ఆయన చింతించారు. అనంతరం నాగార్జున మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య రైల్వే అధికారులతో మాట్లాడి గేటు మూసివేయకుండా నిలిపామన్నారు. కానీ ఇటీవల గేటు మూసివేయడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి కావున రైల్వే అధికారులు తొందరగా అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేసి మా కాలనీ వాసుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కౌన్సిలర్ నాగార్జున ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికీ ఎన్నో ప్రాణాలు కోల్పోయామని ఎంతోమంది యువకులు చనిపో యారని రాత్రి వేళలో కాలనీవాసులు రాకపోకలు సాగించలేక ఉన్నారని. చాలా ఇబ్బందికరంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో నాయకులు, అధికారులు త్వరగతిన మా కాలనీ వాసులకు సహాయం చేయాలని నాగార్జున కోరారు.

## ఘనంగా హిందూ సమ్మేళనం



నాయుడుపేట, జనవరి 4 ప్రభాతవార్త: భారతదేశం మొత్తం మీద లక్షకు పైగా హిందూ సమ్మేళన కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని ఇది హిందువులందరిలోను స్ఫూర్తిని నింపుతుందని శ్రీ వశిష్ట ఆశ్రమ శ్రీ లలితపీఠ వ్యవస్థాపక పీఠాధిపతులు పరమహంస పరివ్రాజక చార్యలు స్వరూపానందగిరి స్వామి అన్నారు. నాయుడుపేటలోని గాంధీ మందిరం వద్ద ఆదివారం సాయంత్రం హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని ఎంతో గొప్పగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామదేవత శ్రీ పోలేరమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి ర్యాలీగా సభా ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్వరూపానందగిరి స్వామితో పాటు న్యూఢిల్లీ ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయభారతి, జాతియ సాహిత్య పరిషత్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మావుడూరు సూర్యనారాయణమూర్తిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వరూపానందగిరి స్వామి ప్రసంగించారు. నాయుడుపేటలో ఈ సమ్మేళనం జరగడం ఎంతో సంతోషదాయకమని సివి రామన్ డిగ్రీ కాలేజ్ కరస్పాండెంట్ గాదిరెడ్డి గోపి అన్నారు. ఈ కార్యక్రమానికి నాయుడుపేట ఆర్యవైశ్య సంఘం సభ్యులు రాఘవేంద్ర సిమెంట్స్ అధినేత సురేష్ బాబులతో ఆ సంఘ సభ్యులు పాల్గొనగా నాయుడుపేట ప్రజలు భారీగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని తిలకించారు. ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో జరగాలని పలు రకాల హిందువులు తమ తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు.

## గంగాప్రసాద్‌కు పలువురు ప్రముఖుల పరామర్శ



సూళ్లూరుపేట, జనవరి 4 ప్రభాతవార్త: సూళ్లూరుపేటకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, టిడిపి అగ్రనేత కొండేపాటి గంగాప్రసాద్ సోదరుడు సత్య నారాయణ చౌదరి శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆదివారం సత్య నారాయణ చౌదరి పార్థివదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు సత్యనారా యణ చౌదరి పార్థివ దేహానికి నివాళి అర్పించి గంగాప్రసాద్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. సర్వేపల్లి, వెంకటగిరి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, బొజ్జల సుధీర్‌రెడ్డి తదితరులు గంగాప్రసాద్‌ను పరామర్శించారు. అలాగే మాజీమంత్రి పరసా రత్నం, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడుతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు పరామర్శించి సంతాపం తెలిపారు.

## నేటి నుండి గ్రామాల్లో సభలు

వెంకటగిరి, జనవరి 4 ప్రభాతవార్త : మండలంలో ఈ నెల 5వ తేదీ నుండి స్వచ్ఛ సంక్రాంతి స్వచ్ఛ పంచాయతీలు 2026 గ్రామ సభలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి తెలిపారు. చెత్త రైత గ్రామపంచాయతీ అనే ప్రధాన లక్షలతో గ్రామసభలు నిర్వహిస్తామని చెప్పారు. స్వచ్ఛ సంక్రాంతి, స్వామిత్వ, ఉపాధి హామీ పథకం, స్వర్ణ పంచాయతీ అనేవి ముఖ్య అజెండాలుగా గ్రామసభల్లో ఉంటాయి అని తెలిపారు.

# గూడూరు డివిజన్

## రెవెన్యూ సర్వీసెస్ ప్రధాన కార్యదర్శిగా గోపీనాథ్‌రెడ్డి



సూళ్లూరుపేట, జనవరి 4 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా రెవెన్యూ సర్వీసెస్ ప్రధాన కార్యదర్శిగా సూళ్లూరుపేట తహశీల్దార్ పెళ్లూరు గోపీనాథ్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం తిరుపతిలో నిర్వహించిన ఎన్నికల్లో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో పాటు నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసుకున్నారు. గోపీనాథ్‌రెడ్డి రెండోపర్యాయం జిల్లా అసోసియేషన్‌కు ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. జిల్లాలో రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ సమస్యలపై తనవంతు ప్రయత్నం చేసి పరిష్కరించేందుకు కృషి చేస్తానని గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లాలోని 36 మండలాలతో పాటు తిరుపతి కలెక్టరేట్ కార్యాలయానికి సంబంధించి తమ అసోసియేషన్ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## పాఠశాల భవనంపై నుండి క్రింద పడిపోయిన విద్యార్థి!

**-ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది**



తడ, జనవరి 4 ప్రభాతవార్త: కండ్రిగ కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం విద్య అభ్యసిస్తున్న ఇరకం వెంకటలక్ష్మి శనివారం రాత్రి 9 గంటల సమయంలో పాఠశాల మొదటి అంతస్తు నుండి క్రిందపడి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ప్రమాదం శాతం జరిగిందా, విద్యార్థి భవనంపై నుండి క్రిందకు దూకిందా అన్న విషయం విచారణలో తెలియాల్సి ఉంది. భవనంపై నుండి క్రిందపడిన విద్యార్థికి తీవ్ర గాయాలు కావడంతో పాఠశాల సిబ్బంది సూళ్లూరుపేట ప్రభుత్వ హాస్పిటల్ కి హుటాహుటిన తరలించారు. రెండు కాళ్ల విరగడం, తలకు బలమైన గాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతి ప్రభుత్వ హాస్పిటల్‌కి తరలించారు. ప్రమాదం 9రాత్రి గంటల సమయంలో జరగగా విద్యార్థి తల్లిదండ్రులకు పాఠశాల సిబ్బంది 11రాత్రి గంటలకు సమాచారం ఇవ్వడాన్ని విద్యార్థి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు ప్రమాదానికి గల కారణాలు విచారణలో తెలియాల్సి ఉంది.

## సత్యనారాయణ అంత్యక్రియలో పాల్గొన్న ఎమ్మెల్యే



వెంకటగిరి, జనవరి 4 ప్రభాతవార్త: ప్రముఖ పరిశ్రమ వేత్త గంగాప్రసాద్ సోదరుడు సత్య నారాయణ మృతి చెందడంతో ఆయన పార్థివ దేహానికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పూల మాల వేసి నివాళులర్పించారు. వియ్యంకుడు అయిన గంగా ప్రసాదను ఎమ్మెల్యే పరామర్శిం చారు. ఆయనకు మనోధైర్యం చెప్పారు. సత్యనా రాయణ మృతి బాధాకరం అన్నారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ ఏఎంసి చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, మాజీ పార్టీ అధ్యక్షులు ఆనంద్‌లు ఉన్నారు.

## కోడిపందాల స్థావరాలపై పోలీసులు దాడులు



బాలాయపల్లి, జనవరి 4 ప్రభాతవార్త: మండలంలోని పిగిలాం ఎస్సీ కాలనీ ప్రాంతంలో జరుగుతున్న కోడిపందాలపై ఎస్సై కామినేని గోపి సిబ్బంది దాడులు నిర్వహించారు. కోడిపందాలు ఆడుతున్న 16 మందిని అదుపులోకి తీసుకొని, 8190 రూపాయల నగదు,10 ద్విచక్ర వాహనాలు, మూడు కోడి పుంజులు, ఎనిమిది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు, పేకాట ఆడుతున్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పట్టించుకోకపోవడం దారుణం



వెంకటగిరి, జనవరి 4 ప్రభాతవార్త: పట్టణానికి తాగునీరు అందించే సమస్య ట్యాంకు దుస్థితికి చేరుకున్న ఎవరు పట్టించుకోలేదని వైసిపి ఆర్టిఐ విభాగం నియోజకవర్గం అధ్యక్షులు, కౌన్సిలర్ ఆరిశంకరయ్య ఆందోళన చెందారు. అప్పటి మాజీ సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మిలు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను నిర్మించాలని చెప్పారు. 20 ఏళ్లయిన అప్పట్లో ఏర్పాటు చేసిన విద్యుత్ మోటర్లు, షట్టర్‌లో నేటికీ వాటినే ఉపయోగిస్తున్నారని తెలిపారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ మొత్తం దుస్థితికి చేరుకున్నట్లు తెలిపారు. కొన్ని వస్తువులు తుప్పు పట్టి నాశనం అయినట్లు తెలిపారు. చైర్ పర్సన్ నక్క భానుప్రియ చర్య తీసుకొని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును బాగు చేయించాలని కోరారు.

## మహిళా ఉపాధ్యాయులను సత్కరించిన యుటిఎఫ్

వెంకటగిరి, జనవరి 4 ప్రభాతవార్త: సావిత్రిబాయి పూలే జయంతి, జాతీయ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా పలువురు సన్మానించారు. యుటిఎఫ్ సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. అద్దంకి విజయలక్ష్మి తదితర ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కుమార్ స్వామి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి గ్రామసభలు

బాలాయపల్లి, జనవరి 4 ప్రభాతవార్త : మండలంలో ఈనెల 5వ తేదీ నుండి స్వచ్ఛ సంక్రాంతి స్వచ్ఛ పంచాయతీలు 2026 గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నారాయణ తెలిపారు. చెత్త రహిత గ్రామపంచాయతీ అనే ప్రధాన లక్షలతో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్వచ్ఛ సంక్రాంతి, స్వామిత్వ, ఉపాధి హామీ పథకం, స్వర్ణ పంచాయతీ అనేవి ముఖ్య అజెండాలుగా గ్రామసభల్లో ఉంటాయి అని వివరించారు.

# చెట్లు నరికితే ఏంటీ!

**- డిఇఓ కార్యాలయంలో అనుమతి లేకుండా చెట్లు నరికివేత**



చిత్తూరు, జనవరి 4 ప్రభాతవార్త: తమ కార్యాలయం ఆవరణలో వున్న చెట్లు నరికితే మీకేమిటి అభ్యంతరం! తాము పెంచి పెద్ద చేసిన చెట్లను ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకుంటే మీకేంటీ నొప్పి! అంటున్నారు జిల్లా విద్యాశాఖ కార్యాలయ అధికారులు. మొక్కల పెంపకం, పచ్చదనం పెంపుదల, వాతావరణ సమతుల్యంపై అనునిత్యం విద్యార్థులకు క్లాసులు పీకే ప్రభుత్వ ఉపాధ్యాయుల జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కొంతమంది అధికారులు ఫారెస్ట్ అధికారుల అనుమతులు లేకుండా చెట్లు నరికివేసిన వైనమిది. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలు ఎక్కడైనా చెట్లు నరకాలంటే అటవీశాఖ అనుమతి తప్పనిసరి. చెట్లు నరకడానికి అటవీశాఖ నుండి అనుమతులు పొందిన తరువాతే ఎక్కడైనా వృక్షాలను నరికి తాము వినియోగించుకోవడమో లేక ఇతరులకు విక్రయించడమో! చేస్తారు. జిల్లాలోని విద్యార్థులందరికీ పాఠాలు చెప్పే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని అధికారులు మాత్రం ఇందుకు విరుద్ధంగా వ్యవహరించి తమ కార్యాలయం ఆవరణలో వున్న చెట్లను అటవీశాఖ అనుమతులు లేకుండా నరికివేశారు. ఈ విషయం అటవీశాఖ అధికారులకు తెలియడంతో వారు రంగంలోకి దిగడంతో చెట్లు నరికితే వచ్చిన దుంగలు అలాగే వుండిపోయాయి. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలోని కొంతమంది అధికారులకు డిఇఓ కార్యాలయం ఆవరణలో వున్న చెట్లు అడ్డుగా అనిపించాయి. ఈ మేరకు చెట్లను నరికివేయడానికి ఒకరిద్దరిని అడిగారు. ఎవరైతే ఎక్కువ డబ్బులు ఇచ్చారో వారికి చెట్లు నరికి తీసుకెళ్ళాలని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ అధికారులు చెప్పడంతో ఆ మేరకు వారు చెట్లు నరికివేశారు. అయితే ఈ విషయం ఫారెస్ట్ అధికారులకు తెలియడంతో వారు రంగంలోకి దిగి ఎవరి అనుమతి తీసుకుని చెట్లు నరికారని ప్రశ్నలు వేయడంతో తమకు డిఇఓ కార్యాలయ అధికారులు చెప్పడంతో నరికామని చెప్పి వారు తప్పించుకున్నారు. అయితే ఫారెస్ట్ అధికారులు డిఇఓ కార్యాలయ అధికారుల వద్దకు వెళ్ళి తాము ఇచ్చిన అనుమతి పత్రం చూపాలని చెప్పడంతో చెట్లు నరకడానికి తాము ఎలాంటి అనుమతులు తీసుకోలేదని వారు పేర్కొనడంతో ఫారెస్ట్ సిబ్బందికి చిర్రెత్తింది. నరికిన చెట్ల దుంగలు అలాగే వుంచాలని వీటిని అక్కడి నుండి తమ అనుమతి లేకుండా తరలించవద్దని ఫారెస్ట్ సిబ్బంది ఖరాకండిగా చెప్పి వెళ్ళిపోయారు. ఈ క్రమంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయ అధికారులు ఇప్పుడు ఫారెస్ట్ అధికారులకు నరికిన చెట్లకు ఇకపై నరుకుతామని చెప్పి అనుమతులు తీసుకోవడానికి లేఖ రాశారు. అయితే ఈ లేఖపై ఇప్పటి వరకు ఫారెస్ట్ అధికారుల నుండి ఎలాంటి స్పందన లేదు. ఈ పరిస్థితుల్లో జిల్లా విద్యాశాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాజేంద్రప్రసాద్ ఈ విషయంపై దృష్టి సారించి డిఇఓ కార్యాలయంలో చెట్ల నరికివేతకు ఎవరు అనుమతి ఇచ్చారు! వాటికి ఎంతకు విక్రయించారు! అనే విషయాలను విచారించి తెలుసుకుని తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## సిఐటియు జాతీయ కౌన్సిల్‌కు...కందారపు మురళి



తిరుపతిరవాణ,జనవరి 4ప్రభాతవార్త: విశాఖ పట్నంలో జరిగిన సిఐటియు 18వ అఖిలభారత మహాసభల్లో తిరుపతి జిల్లా నుండి జాతీయ కౌన్సిల్‌కు కందారపు మురళి ఎన్నికయ్యాడు. తిరుపతి జిల్లా అధ్యక్ష,కార్యదర్శి ఎస్.జయచంద్ర, టి.సుబ్రమణ్యం అభినందనలు తెలిపారు. తిరుపతి జిల్లా నుండి జాతీయ మహాసభలకు కందారపు మురళి, ఎస్.జయచంద్ర,టి.సుబ్రమణ్యం,ఆర్.లక్ష్మీ ,ఎస్. వాణిశ్రీ ప్రతినిధులుగా హాజరయ్యారు. ఈ మహాసభల్లో కార్మిక సమస్యల పైన అనేక తీర్మానాలు చేయడం జరిగింది. ఫిబ్రవరి 12వ తేదీ లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని జరిగే దేశవ్యాప్త సమ్మెను కార్మిక వర్గం జయప్రదం చేయాలని సిఐటియు 18వ అఖిలభారత మహాసభ పిలుపునిచ్చింది.

## చిన్న రామాపురంలో జల్లికట్టు సంబరాలు

**పట్టీల కోసం యువత పట్టీలు**



చంద్రగిరి, జనవరి 4 ప్రభాతవార్త: మండల పరిధిలోని చిన్న రామాపురంలో ఆదివారం జల్లికట్టు సంబరాలు అట్టహాసంగా నిర్వహించారు. ఏడాదికి ఒకమారు ఏరువాక ముగిశాక రైతులు తమ పాడి పశువులకు పూజలు నిర్వహించి పండుగ జరుపుకోవడం సంప్రదాయంగా వస్తున్నది. ఇందులో భాగంగా పాడిరైతులు తమ ఆవులు, ఎద్దులను ఉదయాన్నే శుద్ధి జలాలతో శుభ్రం చేశారు. కొమ్ములను నున్నగా అరగదీసి వాటికి రంగులద్దారు. చెక్కను అందంగా మలిచి కొమ్ములకు కట్టి పౌరుషంతో రంకెలేస్తున్న పశువులను జనంలోకి వదలిపెట్టారు. పశువుల కొమ్ములకు కట్టిన పట్టీని సొంతం చేసుకోవడాన్ని పౌరుషానికి ప్రతీకగా భావించే యువత పోటెత్తిన ఉత్సాహంతో ముందుకు దూకి అదుపుతప్పిన కొందరు పట్టీలు కొట్టారు. ఈ సంబరాలలో 6 మందికి రక్తగాలయ్యాయి.

## గుర్తుతెలియని వాహనం ఢీ..వృద్ధుడు దుర్మరణం



గంగవరం, జనవరి 4, ప్రభాతవార్త : గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందిన సంఘటన ఆదివారం ఉదయం మండలంలో చోటు చేసుకుంది.గంగవరం అర్బన్ సిఐ ప్రసాద్ కథనం మేరకు వివరాలిలా..మండలంలోని కీలపల్లి పంచాయతీ పొన్నమాకులపల్లె గ్రామానికి చెందిన శ్రీహరి(71)అనే వృద్ధుడు చిల్లర దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో వృద్ధుడు ఇంటి నుండి చిల్లర దుకాణం తీయడానికి ఉదయం దుకాణం వద్దకు వచ్చాడు ఈ క్రమంలో తాళాలు మరచిపోవడంతో తాళాల కోసం తిరిగి ఇంటికి వెళ్ళడానికి రహదారి పక్కన నిలబడి ఉండగా బెంగళూరు వైపు నుండి పలమనేరు వైపు వస్తున్న గుర్తుతెలియని వాహనం వేగంగా, అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వచ్చి వృద్ధుడిని ఢీ కొట్టి వెళ్ళిపోయింది.ఈ ప్రమాదంలో వృద్ధుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.విషయం తెలుసుకున్న సిఐ ప్రసాద్ సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించి మృత దేహాన్ని శవ పరీక్ష నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తిరుపతి రూరల్‌లో చిన్నారిపై అఘాయిత్యం!

**-నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు**

తిరుచానూరు, జనవరి4 ప్రభాతవార్త : తల్లిదండ్రులు కూలీపనులు చేసుకుని జీవనం సాగిస్తున్న గ్రామంలో అభంశుభం తెలియని ఏడేళ్ల చిన్నారికి చాక్లెట్ ఆశచూపి ఇంటిలోపలకు తీసుకెళ్ళి అఘాయిత్యానికి పాల్పడిన ఘటన తిరుపతి జిల్లా తిరుపతి రూరల్ తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏడేళ్ళబాలికపై ఏకంగా 30ఏళ్ళ నాగరాజు అత్యాచారయత్నం చేశాడు. నిందితుడు వడమాలపేట మండలానికి చెందిన వాడుగా గుర్తించారు.అతనిని తిరుచానూరు పోలీసులు ఫోక్సో కేసు క్రింద అరెస్ట్ చేశారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. ఇంట్లో తల్లిదండ్రులు కూలీపనులకెళ్ళిన సమయంలో చాక్లెట్ ఆశచూపి ఏడేళ్ళ గిరిజన బాలికపై నాగరాజు ఈ దారుణానికి ఒడిగట్టాడు. బాలిక అరుపులతో స్థానికులు అక్కడకు చేరుకుని నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. తిరుచానూరు పోలీసులకు సమాచారం అందించడంతో అతనిని స్టేషన్‌కు తీసుకెళ్ళారు. తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికను సురక్షిత ప్రాంతానికి తరలించి శారీరక,మానసిక వైద్యపరీక్షలు చేయించారు. ఈ సంఘటనతో స్థానికులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోందని, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్‌చేశారు.

## బోయకొండ గంగమ్మ సేవలో ఎమ్మెల్యే గురజాల



చిత్తూరురూరల్, జనవరి 4ప్రభాతవార్త: ప్రసిద్ధిగాంచిన బోయకొండ గంగమ్మను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తన కుటుంబసభ్యులు, తెదేపా నాయకులతో కలసి ఆదివారం దర్శించుకొన్నారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేను స్థానిక ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. ఎమ్మెల్యే కుటుంబసభ్యులతో కలసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. దర్శనం అనంతరం ఎమ్మెల్యే కుటుంబసభ్యులను వేద పండితులు ఆశీర్వదించారు. ఆలయ ఈవో ఏకాంబరం ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేసారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**- కలెక్టర్ సుమిత్‌కుమార్**

చిత్తూరు, జనవరి 4 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరు హాజరై ప్రజల నుండి అందిన సమస్యలను పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నియోజకవర్గ, మండల కేంద్రాల్లో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలకు సంబంధిత అధికారులు హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించి వాటిని సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

## ప్రజా దర్బార్‌కు సన్నద్ధం అవుతున్న అధికార యంత్రం



వాకాడు, జనవరి 4 ప్రభాతవార్త: మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలోని సోమవారం ప్రజా దర్బార్ కార్యక్రమానికి గూడూరు శాసన సభ్యుడు డాక్టర్ పాశం సునీల్ కుమార్ రానున్న సందర్భంగా అధికారి యంత్రాంగం సన్నద్ధం అవ్వాలని ఎంపీడీవో సాయిప్రసాద్ తెలిపారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయం లో మండల స్థాయి అధికారులు, సిబ్బందితో ఎంపీడీవో సాయిప్రసాద్, తహసిల్దార్ సయుద్ ఇక్బాల్ లు సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సాయిప్రసాద్ మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు సిబ్బంది ప్రజా దర్బార్ కార్యక్రమమును విజయవంతం చేయాలని సూచించారు, సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందజేశారు, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండలంలోని పలు సమస్యలు పరిష్కరించే విధంగా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ప్రజా దర్బార్ కార్యక్రమంకు హాజరుకావాలని సూచించారు, ప్రజలకు అత్యవసర సమయంలో మెడికల్ క్యాంపు కూడా ఉంటుందన్నారు. అధికారులకు సిబ్బందికి ఎలాంటి మినహాయింపు లేదన్ని హెచ్చరించారు.

## ఏపీఆర్ఎస్ఏ జిల్లా జాయింట్ సెక్రెటరీగా రెవెన్యూ ఇన్స్పెక్టర్



వాకాడు, జనవరి 4 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రెటరీగా వాకాడు రెవెన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీస్ రాష్ట్ర రెవెన్యూ ఎన్నికల సంఘం అధికారులు సమక్షంలో జిల్లా రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కార్యవర్గం జరిగింది. వాకాడు రెవిన్ ఇన్స్పెక్టర్గా పని చేస్తున్న అఖిల్ యాదవ్ ను జిల్లా జాయింట్ సెక్రెటరీగా ఆ కార్యవర్గం ఎన్నిక చేశారు. ఎన్నికైన జిల్లా జాయింట్ సెక్రెటరీ ను రెవెన్యూ శాఖల అధికారులు, మండల వివిధ శాఖ అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈయన ఏపీ ఎన్జీవో వాకాడు తాలూకా యూనిట్ ప్రెసిడెంట్‌గా కూడా వున్నారు.

## లైసెన్స్ లేని వాహనాలను పరిశీలిస్తున్న ఎస్సై



వాకాడు, జనవరి 4 ప్రభాతవార్త : మండలంలోని అశోక పిల్లర్ సెంటర్ కూడలిలో ఆదివారం ఎస్సై నిఖిల్ బాబు వాహందారులపై దాడులు జరిపారు. లైసెన్స్ లేని వాహనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై నిఖిల్ బాబు మాట్లాడుతూ మోహన్ దార్లందరూ తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. హెల్మెట్లు ధరించని యెడల ప్రభుత్వ నిబంధన ప్రకారము చలానా వేయడం జరుగుతుందని తెలిపారు, తాగి వాహనాలు నడపరాదని వాహందారులకు సూచించారు. తాగి నడిపే డ్రంకన్ డ్రైవ్ కేసు నమోదు చేస్తామని వాహందారులకు తెలిపారు. ఈ దాడుల్లో మనోహర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.